టీచర్లు లేకుండా.. సన్మార్గంలో పెట్టేదెలా !

- ఏలూరు ప్రభుత్వ వసతి గృహంలో నిరాదరణ బాలలు 66 మంది
- చట్టంతో విభేదించిన బాలలు ఐదుగురు
- చదువు చెప్పేందుకు ఉపాధ్యాయులే లేరు
- నియామకం పట్టని విద్యాశాఖాధికారులు
- ప్రమాదంలో విద్యార్థుల భవిష్యత్

ఏలూరు క్రైం, ఆగస్టు 10 : నేటి బాలలు రేపటి పౌరులని వారిని సన్మార్గంలో పెడితే భవిష్యత్ సమాజం ఎంతో అభివృద్ధి చెందుతుందని, ఎలాంటి సంఘ వ్యతిరేక శక్తులు ఉండవని విజ్ఞానవంతుల సూచనలతో ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వాలు అమలు చేస్తూనే ఉన్నాయి. కానీ క్షేత్రస్థాయికి వచ్చేసరికి వాటిని సరిగ్గా అధికారులు పట్టించుకోక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇందుకు ఉదాహరణగా ఏలూరు లోని ప్రభుత్వ బాలుర వసతి గృహం (జువైనల్ హోమ్) నిలుస్తోంది.

ఉమ్మడి పశ్చిమ గోదావరి, ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు జిల్లాలకు సంబంధించిన అనాథ బాలలు, చట్టంతో విభేదించే బాలలను సన్మార్గంలో తీర్చిదిద్దడానికి ఏలూరులోని ప్రభుత్వ వసతి గృహాన్ని ఏర్పాటు చేశారు. చట్టంతో విభేదించే బాలల్లో పూర్తిగా మార్పు తీసుకురావడానికి ఈ వసతి గృహంలోనే జువైనల్ హోమ్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నో ఏళ్లుగా పలు సంస్కరణ చర్యలకు శ్రీకారం చుట్టారు. గతంలో ఇక్కడ పిల్లలను శనివారపుపేటలోని హైస్కూలు, ప్రాథమిక పాఠశాలకు చదువుకునేందుకు పంపించే వారు. అలా వెళ్తున్నవారు తరచుగా అదృశ్యం కావడంతో ప్రభుత్వం ప్రత్యేకంగా కొన్నేళ్ల క్రితం ప్రాథమిక స్కూలుకు అనుమతి ఇచ్చి ప్రతి సంవత్సరం అప్ గ్రేడ్ చేసి పదో తరగతి వరకూ రికగ్నైజేషన్ చేశారు. ఏటా డిప్యూటేషన్ పై నియమించిన టీచర్లతో పాటు విద్యా వలంటీర్లు చదువు చెప్పేవారు. అనాథలు, తల్లిదండ్రుల ఆదరణ లేని పిల్లలు అక్కడే చదువుకుంటూ పరీక్షలు రాసి ఆ తర్వాత ఉన్నత చదువులకు పంపించేవారు. 18 ఏళ్లు దాటిన తర్వాత వారి కాళ్ళపై వారు జీవించేందుకు చేతి వృత్తులు నేర్పించి ఆపై రుణం ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేది. ఇలా కష్టపడే తత్వాన్ని అలవాటు చేసేవారు. ఈ విధంగా కొన్నేళ్ల పాటు సాగినా గతేడాది ఉపాధ్యాయులను తిరిగి నియమించలేదు. ఈ క్రమంలోనే ఏడాది క్రితం హైకోర్టు న్యాయమూర్తులు ఆ వసతి గృహాన్ని ఆకస్మికంగా పరిశీలించి పిల్లలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు లేరని తాము ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని వారు చెప్పడంతో హైకోర్టు ఆదేశాల మేరకు డీఈవో ఆ పాఠశాలకు వివిధ సబ్జెక్టులకు సంబంధించి ఆరుగురు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించారు. చట్టంతో విభేదించిన బాలలను సంస్కరణ చేయడానికి అర్హత కలిగిన స్పెషలైజేషన్ టీచర్‌ను నియమించారు. గతేడాది పదో తరగతి పరీక్షకు ఇద్దరు హాజరు కాగా, ఒకరు ఉత్తీర్ణత సాధించారు. మరొకరు కొన్ని సబ్జెక్టుల్లో మాత్రమే ఫెయిల్ అయ్యాడు. అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఈ ఏడాది ఏప్రిల్ 23 రిలీవ్ చేయడంతో తిరిగి వారి సొంత పాఠశాలలకు వెళ్లిపోయారు.



శనివారపుపేట ప్రభుత్వ బాలుర వసతి గృహం

ఎన్ని లేఖలు రాసినా..

2024- 2025 విద్యా సంవత్సరం ఈ ఏడాది జూన్ 12న ప్రారంభమైంది. విద్యాశాఖాధికారులు మాత్రం ఇప్పటి వరకూ ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించలేదు. వసతి గృహం సూపరింటెండెంట్ విద్యా శాఖకు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించాలని కోరుతూ ఎన్ని లేఖలు రాసినా డీఈవో కార్యాలయంలో స్పందన కరువైంది. ఇటీవల జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ ఆ వసతి గృహాన్ని సందర్శించి బాలల నుంచి సమస్యలను తెలుసుకోగా తమకు ఉపాధ్యాయులు లేరని ఇప్పటి వరకు తమకు ఎలాంటి చదువులేదని చెప్పడంతో ఆయన కూడా సంబంధిత అధికారులకు లేఖ రాశారు. అయినా ఇప్పటి వరకు జిల్లా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. ప్రస్తుతం ఆ పాఠశాలలో అనాథలు, తల్లి దండ్రుల ఆదరణ కోల్పోయిన వారు 66 మంది ఉన్నారు. చట్టంతో విభేదించిన బాలలు మరో ఐదుగురు ఉన్నారు. ఇక్కడ ఉన్న బాలలు అందరినీ విద్యా బుద్ధులతో క్రమ శిక్షణతో అహర్నిశలు కష్టపడి తీర్చిదిద్దితే వారు ఉత్తమ పౌరులుగా సమాజంలో జీవించే అవకాశాలు ఉన్నాయి. కానీ ఉపాధ్యాయులు లేకుండా కేవలం వారిని గదుల్లో పెట్టి బంధించి ఉంచితే భవిష్యత్తులో అసాంఘిక శక్తులుగా మారే ప్రమాదం ఉంది. కేవలం అధికారుల నిర్లక్ష్యంతోనే ఇక్కడ విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిపోతోందని విజ్ఞులు చెబుతున్నారు.

నామినేటెడ్ దక్కేదెవరికి?



ఒకరు కాదు.. ఇద్దరు కాదు ఐదేళ్ల పాటు పార్టీ జెండాను మోసి బులుగు రంగు పార్టీపై ఎదురొడ్డి పోరాడి, అక్రమ కేసుల్లో ఇరుక్కుని, ఇల్లు వాకిలి వదిలేసి పార్టీ విజయం కోసం కష్టపడిన వారెందరో. తమ పార్టీ అధికారంలోకి రాగానే ఆశించిన దానికంటే ఎక్కువగానే ప్రాధాన్యత వస్తుందని.. పార్టీ నాయకత్వం గుర్తించి తమ కష్టానికి తగ్గట్టుగానే పదవుల్లో నామినేట్ చేస్తారని ఆశలు పెంచుకున్న టీడీపీ నేతలెందరో. మరోవైపు జనసేన, బీజేపీ పక్షాన నుంచి భారీగానే ఆశావహులు ఉన్నారు. వీరందరి ఆశలు తీర్చేలా కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియలో ఎలాంటి జాబితా విడుదల చేయనుందో మరికొద్ది రోజుల్లోనే తేలనుంది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

త్వరలోనే తొలి జాబితా

- కూటమి నేతల ఆశలు తీరేనా
- నియోజకవర్గాల వారీగా డజన్ల కొద్ది అభ్యర్థన లేఖలు
- ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫార్సులతో మరికొందరు సిద్ధం
- టీడీపీలో కష్టించి పనిచేసిన వారిలో కొంతమందికే ఛాన్స్
- జనసేన, బీజేపీలకు కొంత ప్రాధాన్యత

నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ అనుకూలంగా తెలుగుదేశం భారీగానే కసరత్తు ప్రారంభించింది. ఒక్కో జిల్లా నుంచి డజన్ల సంఖ్యలో వచ్చిన వినతులు ఒకవైపు ఉండగా.. పార్టీ గుర్తించి పదవి ఇవ్వకపోతుందా అని సైలెంట్‌గా ఉన్నవారెందరో. రాబోయే పది పదిహేను రోజుల్లోనే రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్లలో నామినేటెడ్ పదవులు భర్తీకి అనుకూలంగా తుది విడత వడపోత సాగుతున్నట్టు సమాచారం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నామినేట్ పదవుల్లో ఒక్క తెలుగుదేశమే కాకుండా, మిత్రపక్షమైన అటు జనసేన, ఇటు బీజేపీ వైపు నామినేటెడ్ పోస్టులను దామాషా పద్ధతిలో కేటాయించేందుకు కసరత్తు జరుగుతోంది. ప్రత్యేకించి జనసేన, బీజేపీ గెలిచిన నియోజకవర్గాల్లో పార్టీ నేతలెవరూ అసంతృప్తి చెందకుండా సాధ్యమైనంత మేర అక్కడి నేతలకు తొలి విడత ప్రాధాన్యం ఇచ్చేలా టీడీపీ ఇప్పటికే జాగ్రత్త పడుతోంది. తొలుత వెలువడిన సమాచారం ప్రకారం నామినేటెడ్ పోస్టుల ప్రక్రియలో 80 శాతం పైగా టీడీపీ వర్గీయులకు, మరో 13 శాతం జనసేన, మిగిలిన భాగం బీజేపీ నేతలకు కేటాయించాలని కూటమి నేతలంతా భావిస్తున్నట్టు భారీ ప్రచారం సాగింది. ఈలోపే ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహిస్తున్న దర్బార్‌లకు టీడీపీ నేతలు నియోజకవర్గాల వారీగా తరలివెళ్లి తమకు నామినేటెడ్ పోస్టుల భర్తీలో ఓ ఛాన్స్ ఇవ్వాల్సిందిగా వినతిపత్రం అందించి మరీ అభ్యర్థించడం ప్రారంభించారు. అటు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఇటు యువనేత లోకేశ్‌కు పెద్ద సంఖ్యలోనే అభ్యర్థనలు అందజేశారు.

తొలి విడత భర్తీ చేసే పదవులేంటి ?

రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల్లో అత్యంత కీలకమైన ముఖ్య పదవులన్నింటిని తొలి విడతలోనే భర్తీ చేయాలని ఇప్పటికే కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రతీ జిల్లాలోనూ దగ్గరదగ్గరగా అరడజను మందికి తగ్గకుండా చైర్మన్, లేదా డైరెక్టర్ పదవులు ఇచ్చేందుకు అనువుగానే కసరత్తు ఒక కొలిక్కి వచ్చింది. జగన్ ఐదేళ్ల పాలనలో పెద్ద ఎత్తున కుల ప్రాతిపదికన కార్పొరేషన్లు ఏర్పాటు చేసి తమ అనుకూలురందరినీ ఆయా కార్పొరేషన్లలో స్థానం కల్పించారు. ఇప్పుడు ఆ కార్పొరేషన్లన్నీ యథావిధిగానే ఉండబోతున్నట్టు సమాచారం. అత్యంత కీలకమైన డీసీసీబీ చైర్మన్ పదవి కోసం ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో అనేక మంది పోటీ పడుతున్నారు. ఈ పదవి కోసం భీమవరానికి చెందిన కోళ్ళ నాగేశ్వరరావు ఇప్పటికే పార్టీ అధినేత చంద్రబాబును కలిసి తనకు కేటాయించాల్సిందిగా అభ్యర్థించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ, ప్రజా రవాణ శాఖ (ఆర్టీసీ), డీసీఎంఎస్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ, దేవదాయ శాఖ, ఐసీడీఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్లు, రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్, రాష్ట్ర మౌలిక వసతుల కమిటీ వంటి అనేక కార్పొరేషన్లతో పాటు రాష్ట్ర స్థాయిలోనే ప్రాధాన్యత కలిగిన కుల కార్పొరేషన్ల చైర్మన్ పదవులు, వాటిలో డైరెక్టర్ స్థానాలకు పార్టీ కోసం సర్వం త్యాగం చేసిన వారికే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నారు. ఉదాహరణకు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవి కోసం రాష్ట్ర స్థాయితో పాటు జిల్లా నుంచి అనేక మంది పోటీలు పడుతున్నారు. ఈ పదవి కోసం ఏలూరుకు చెందిన దాసరి ఆంజనేయులు ఆసక్తి చూపుతున్నారు. స్థానిక పార్టీ నాయకత్వం అనేక మంది మద్దతుతో ఇప్పటికే అధిష్టానానికి ఆంజనేయులు పేరును సిఫార్సు చేసింది. ఎస్టీ కార్పొరేషన్ విషయంలోను ఇదే పరిస్థితి. నియోజకవర్గాల వారీగా ముఖ్య నేతలంతా స్థానిక ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలు, జిల్లాలోని వివిధ నియోజక వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల లేఖలు తీసుకుని తెలుగుదేశం అధిష్టానానికి సమర్పించారు.

జనసేన, బీజేపీ సంగతేంటి ?

పోలవరం, ఉంగుటూరు నియోజకవర్గాల్లో జనసేన పక్షాన చిర్రి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు ఎమ్మెల్యేలుగా గెలిచారు. ఈ రెండు నియోజకవర్గాల్లోనూ తమ కోసం కష్టపడి పనిచేసిన పార్టీ కేడర్‌కు ఎమ్మెల్యేలు కొంత రుణం తీర్చుకోవాల్సి ఉంది. ఈక్రమంలోనే నామినేటెడ్ పదవుల్లో జనసేన, బీజేపీకి కేటాయించిన నిష్పత్తి ప్రకారం మాత్రమే పోస్టుల భర్తీలో అవకాశం లభించనుం ది. కైకలూరు నుంచి బీజేపీ పక్షాన డాక్టర్ కామినేని శ్రీనివాస్ గెలిచారు కాబట్టి ఆ నియోజకవర్గంలో బీజేపీ ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. ఈ మూడు నియోజక వర్గాల్లోను జనసేన, బీజేపీకి రాష్ట్రస్థాయి కార్పొరేషన్లలో ఎన్ని పదవులు దక్కుతాయనేది ప్రశ్నార్థకంగానే మారింది. అటు జనసేనాధిపతి పవన్‌కళ్యాణ్‌ను కలసి తమకు కూటమి ప్రభుత్వంలో ప్రాధాన్యత కలిగిన నామినేటెడ్ పోస్టులను కేటాయించేలా చూడాలని కొంద రు నేతలు ఇప్పటికే అభ్యర్థించారు. బీజేపీ పక్షాన సైతం రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి వినతులు అందజేశారు. ఎఫ్‌సీఐ, కమ్యూనికేషన్స్, డిఫెన్స్, రైల్వేల్లో కొన్ని నామినేటెడ్ పోస్టుల్లో బీజేపీ నేతలకు అవకాశం దక్క వచ్చు. రాష్ట్ర స్థాయిలోను డైరెక్టర్ స్థాయి పదవులు కొన్నింటిని కేటాయించే దిశగానే ఇప్పటివరకు కసరత్తు సాగినట్టు సమాచారం. ఏలూరు జిల్లాలో మొత్తం మీద తెలుగుదేశం పక్షాన వంద మందికి పైగానే నామినేటెడ్ పదవులు ఆశిస్తుండగా జనసేన, బీజేపీ పక్షాన నుంచి డజన్ల సంఖ్యలో ఆశావహులు ఉన్నారు.

ఇంతకుముందు ఐసీడీఎస్ రీజనల్ డైరెక్టర్ హోదాలో పనిచేసిన కొయ్యలగూడెంకు చెందిన మేఘలాదేవి ఈసారి కూడా తాను పడిన కష్టాన్ని దృష్టిలో పెట్టుకుని మరో అవకాశం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు. మహిళా కమిషన్ సభ్యురాలిగా మరికొంత మంది పోటీ పడుతున్నారు. ఏలూరుకు చెందిన విద్యావంతు రాలైన కడియాల విజయలక్ష్మితోపాటు కొందరు సీనియర్లు నామినేటెడ్ పోస్టుల భర్తీలో తమకు అవకాశం రాగలదనే విశ్వాసంతో ఉన్నారు. సాధ్యమైనంత మేర ఏలూరు జిల్లాకు చెందిన అరడజను మందికి తొలి విడతలో ఆయా కార్పొరేషన్లలో స్థానం దక్కవచ్చని ఇప్పటికే వినపడుతోంది.



ఆటపాకలో కట్ల జాతి చేపలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, కేంద్ర బృంద సభ్యులు


సుస్థిర ఆక్వా ఉత్పత్తులను సాధించాలి

- కలెక్టర్ వెట్రిసెల్వి.. కైకలూరులో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ నిపుణుల బృందం పర్యటన

కైకలూరు, ఆగస్టు 10 : పర్యావరణ సమతుల్యతను పాటిస్తూ నూతన సాంకేతిక పద్ధతులను ఉపయోగించి సుస్థిరమైన ఆక్వా ఉత్పత్తులు సాధించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి అన్నారు. ఆటపాకలో చేపల చెరువులను శనివారం కేంద్ర ప్రభుత్వ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ నిపుణుల బృందం, మత్స్యశాఖ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఆక్వా ఉత్పత్తులు చేసే విధానం వాటికి కావాల్సిన బ్రూడర్స్ చేపల, రొయ్యలకు వినియోగించే మేతలు వాటిని సాగు చేసే విధానాన్ని కేంద్రబృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణహిత ఆక్వా ఉత్పత్తులను సాధించేందుకు ప్రపంచ బ్యాంకు 107 కోట్లు రాష్ట్రానికి నిధులు కేటాయించిందన్నారు. ఆక్వా ఉత్పత్తులు ఎంత అవసరమో పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతుల, ప్రజలపై ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఈ నిపుణుల బృందం డీపీఆర్‌ను రాష్ట్ర ఉన్నతాధికారులకు, కేంద్రప్రభుత్వానికి అందజేస్తుందన్నారు. కోళ్ళ వర్థాలు రవాణా చేసినా వినియోగించే రైతులపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని బాదంపూడి, కొవ్వలిలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాల్లో నాణ్యమైన సీడ్ తయారు చేసేలా చర్యలు చేపడతామన్నారు. ఆక్వా పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర చేపల రైతుల అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ముదునూరి సీతారామరాజు కలెక్టర్‌కు, కేంద్ర బృందానికి వివరించారు. మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్ ఎస్.ఎంజలీ, ఆర్డీవో కాజావలీ, జీవవైవిధ్య నిపుణుల బృందం ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ప్రతినిధి డాక్టర్ కొండా చవ్వ, సీమా భట్, సాంకేతిక నిపుణులు మురళీధరన్, ఆక్వా కల్చర్ స్పెషలిస్ట్ విష్ణుభట్, పర్యావరణ ప్రతినిధి సీనా కోషి, నీల్‌కాంత్ మిశ్రా, డివిజనల్ ఫిషరీస్ అధికారి నాగలింగాచార్యులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు రిజర్వేషన్ కల్పించాలి

- కలెక్టరేట్ వద్ద దళిత క్రైస్తవ సంఘాల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దళిత క్రైస్తవులు

ఏలూరు రూరల్, ఆగస్టు 10 : దళిత క్రైస్తవులకు దళిత రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ దళిత క్రైస్తవ సంఘాలు, ఏలూరు నగర క్రైస్తవ శాఖల ఆధ్వర్యంలో సమైక్య నిరసన దినం పేరుతో కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. తొలుత విద్యానగర్‌లోని బిషప్ హౌస్ నుంచి అమీనాపేట చర్చి మీదుగా ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు భారత ప్రభుత్వం రిజర్వేషన్లు నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఇది ప్రజాస్వామ్య పాలనకు మాయని మచ్చని, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. దళిత సిక్కులకు, దళిత బౌద్ధులకు రాజ్యాంగ సవరణల ద్వారా రిజర్వేషన్లు కల్పించిన భారత ప్రభుత్వం దళిత క్రైస్తవులకు రాజ్యాంగ బద్ధంగా అందాల్సిన రిజర్వేషన్లు గత 74 ఏళ్లుగా అందనివ్వకుండా చేస్తోందని విమర్శించారు. దళిత క్రైస్తవుల పట్ల కేంద్రం వివక్ష, పక్షపాత వైఖరితో వ్యవహరిస్తోందన్నారు. దళిత క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, జాన్ ఎస్పీ రాజ్, ఫాదర్ మోజేష్ పెద్దఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు.

కుళాయి కనెక్షన్.. ఇచ్చారా..లేదా?



- వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన కనెక్షన్లపై ఆరా
- ఈనెల 15 వరకు ఇంటింటికీ హౌస్ హోల్డ్ వాటర్ సప్లై పల్స్ సర్వే
- జిల్లాలో 4.74 లక్షల గృహాలు
- ఇప్పటి వరకు ఇచ్చిన కుళాయి కనెక్షన్లు 4.06 లక్షలు.. ఇంకా ఇవ్వాల్సినవి 68.964

ఏలూరు సిటీ, ఆగస్టు 10 : జిల్లాలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కుళాయి కనెక్షను ఇవ్వాలని ఆనాడు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన వాటాగా 50/50 శాతం నిధులతో ఈ జలజీవన్ మిషన్ పథకాన్ని అమలు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకం కొంత జాప్యం జరిగిందనే చెప్పుకోవాలి. జిల్లాలో 4,74,978 గృహాలు ఉండగా ఇందులో అప్పటికే రెండు లక్షలు పైగా కుళాయిలు ఇంటింటికీ ఏర్పాటయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వం మరో రెండు లక్షల కుళాయి కనెక్షన్లను ఈ పథకంలో ఇచ్చినట్లు చెబుతోంది. జిల్లాలో జలజీవన్ మిషన్ పథకానికి సంబంధించి 1,772 పనులు చేపట్టడానికి రూ.454.10 కోట్లు నిధులు మంజూరు చేశారు. అప్పట్లో రూ.58.04 కోట్లతో 837 పనులు పూర్తయ్యాయి. మిగిలిన వాటిల్లో 413 పనులు కొనసాగుతున్నాయి. 522 పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఈ ఏడాది 157 గ్రామాలకు సంబంధించి 232 హేబిటేషన్లలో 239 పనులు చేపట్టాలని, 23,713 కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. అయితే ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి (2025 మార్చి నాటికి) 23,713 కుళాయి కనెక్షన్లు ఏర్పాటులో భాగంగా 100 రోజుల్లో 10,459 కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. జలజీవన్ మిషనులో భాగంగా పైప్‌లైన్లు, ఓహెచ్ ఎస్ ఆర్, బోర్లు, ఎస్ఎస్ ట్యాంకులు, ఫిల్టర్ ప్లాంట్స్ ఏర్పాటు చేసి ఇంటింటికీ కుళాయి లేని వారికి కుళాయి కనెక్షన్లు ఇప్పించాలని నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలో మొక్కు బడిగా ఈ పథకం అమలు జరిగిందనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన కనెక్షన్లపై ప్రస్తుత ప్రభుత్వం ఆరా తీస్తోంది. అసలు ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశారా.. లేదా గతంలో వేసిన కనెక్షన్లను తామే వేసినట్టు చూపించారా.., అసలు మంచినీటి వనరులు ఏర్పాటు చేశారా లేదా అనే విషయాలను ప్రత్యేక యాప్‌లో పొందుపరచి ఈ పల్స్ సర్వే చేయాలని నిర్ణయించారు.

పల్స్ సర్వే ప్రారంభం

పల్స్ సర్వే ఆఫ్ హౌస్‌హోల్డ్స్ వాటర్ సప్లై టూ టాప్ కనెక్షన్ యాప్ ద్వారా ఈ పల్స్ సర్వే కార్యక్రమాన్ని ఈనెల 9వ తేదీన ప్రారంభించారు. ఆగస్టు 15వ తేదీ వరకు ఈ సర్వే నిర్వహించి సమగ్ర నివేదికను రూపొందిస్తారు. ఈ సర్వేలో ప్రధానంగా ఇంటింటికీ తిరిగి కుళాయి కనెక్షన్ల తీరును వారు పరిశీలిస్తారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, డిజిటల్ అసిస్టెంట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ఈ సర్వేలో పాల్గొని ఇంటింటికీ పల్స్ సర్వే యాప్‌లో వివరాలను పొందుపరుస్తారు. మండల స్థాయిలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఈవోఅండ్ పీఆర్‌ఆర్‌డీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ఈ సర్వేను పర్యవేక్షిస్తారు. ఈ పల్స్ సర్వేలో ప్రధానంగా ఇంటి వద్దకు వెళ్లి ఏ మంచినీటి వన రుల ద్వారా నీరు సరఫరా అవుతోందో పరిశీలిస్తారు. ఆ విషయాన్ని జియో ట్యాగింగ్ చేస్తారు. ఎన్ని ఇళ్లను ఆ మంచినీటి పథకం ఉపయోగపడుతోంది, ఆ ఇంటికి కుళాయి ఉందా లేదా అనే విషయాన్ని పరిశీలిస్తారు. ఒక వేళ కుళాయి ఏర్పాటు చేసి ఉంటే అది ఏ సంవ త్సరంలో ఏర్పాటు చేశారు అనే విషయాన్ని తెలుసుకుంటారు. ఆ కుళాయి కనెక్షనుకు సంబంధించి అధికారులు సొమ్ములు ఏమైనా వసూలు చేశారా.. అన్న విషయాన్ని ఆరా తీస్తారు. ఆ కుళాయికి రోజు రెగ్యులర్ గా నీటి సరఫరా జరుగుతోందా, నీరు ఎంత సేపు సరఫరా చేస్తున్నారు, నీటి నాణ్యత ఎలా ఉంది, అనే విషయాలను తెలుసుకుని యాప్‌లో పొందుపరుస్తారు. అక్కడ కూడా జియో ట్యాగింగ్ చేస్తారు. లోకేషన్‌ను ఆ యాప్‌లో పొందుపరు స్తారు. ఒక వేళ కుళాయి కనెక్షన్ లేకపోతే ఇప్పటివరకు వారు మంచినీటిని ఎక్కడ నుంచి తీసుకొస్తున్నారు. అది పబ్లిక్ కుళాయి కనెక్షన్, లేదా సొంత బోరు నీటిని వినియోగించుకుంటున్నారా, లేదా ఆర్వో వాటర్ తెచ్చుకుంటున్నారా అనే విషయాలను పరిశీలించి అక్కడ కుళాయి కనెక్షన్ వేయాల్సిన అవసరాన్ని యాప్‌లో పొందుపరుస్తారు. అక్కడ ఇచ్చే కుళాయి కనెక్షన్‌ను ఎన్నిరోజుల్లో ఇవ్వగలుగుతారు అనే విషయాన్ని ఒక ప్రణాళిక రూపొందించుకుంటారు. ఇలా ప్రతీ ఇంటికీ వెళ్లి గత ప్రభుత్వం వేసిన కుళాయి కనెక్షన్లు సక్రమంగా ఉన్నాయా లేదా అన్న విషయాలను పరిశీలిస్తారు.

జలజీవన్ మిషన్ పనుల కొనసాగింపు

గతంలో చేస్తున్న జలజీవన్ మిషన్ పనులను ఇప్పుడు కూడా కొనసాగిస్తారు. ఆ పనులు ఏ స్థాయిలో ఉన్నాయో అన్న వివరాలను ఈ సర్వే ద్వారా తెలుసుకుంటారు. మొత్తం మీద ఈ సర్వే పూర్తయిన తర్వాత ఈ పథకంలో ఎన్ని మంచినీటి వన రులను ఏర్పాటు చేయాలి, ఎన్ని కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్న విషయాన్ని సమగ్రంగా తెలుసుకుని నివేదికలు రూపొందిస్తారు. ఈ నివేదికలను ప్రభుత్వానికి అందజేస్తారు.

జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ, ఆగస్టు 10:

నైరుతి రుతుపవనాల విజృంభిం చడంతో జిల్లాలో ఇంకా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం వర్షాలు కురిశాయి. గడచిన 24 గం టల్లో అత్యధికంగా నూజివీడు మండలంలో 16.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 1.8 మి.మీ నమోదైంది. కొయ్యలగూడెం 9.4, దెందులూరు 8.2, ద్వారకా తిరుమల 6 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి. జిల్లాలో వర్షం కురిసిన మిగిలిన 7 మండలాల్లో 5 మిల్లీ మీటర్లు కన్నా తక్కువగా వర్షపాతాలు నమోదయ్యాయి.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్.. పాల్గొన్న కోర్టు కానిస్టేబుళ్లు

నేరం చేయాలంటే వెన్నులో వణుకు పుట్టాలి : ఎస్పీ

ఏలూరు క్రైం, ఆగస్టు 10 : జిల్లాలో ఎవరైనా నేరం చేయాలంటే నేరస్తులకు వెన్నులో వణుకుపుట్టే విధంగా కోర్టులలో ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా కోర్టు కానిస్టేబుళ్లు విధులను నిర్వర్తించాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో అన్ని పోలీస్ స్టేషన్ల, కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్షా సమా వేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోర్టులలో జరిగే అన్ని విచారణ కేసులపై మానిటరింగ్ సిస్టమ్ ద్వారా పర్యవేక్షణ చేయడానికి నూతన విధానం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒక నేరస్తుడు శిక్ష నుంచి తప్పించుకుంటే అది సమాజానికి చెడు చేస్తుందని, నేరస్తులకు కోర్టులలో శిక్షలు పడేలా సాక్ష్యులను సకాలంలో హాజరుపర్చాలన్నారు. ఉద్యోగ నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రతిభ కనబరిస్తే నగదు, ప్రశంసా పత్రాలతో సత్కరిస్తామన్నారు. స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు బ్యాంకు రుణాలకు వెళ్లవద్దు
మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు టౌన్, ఆగస్టు, 10 :పాలకొల్లులో టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు కొత్తగా బ్యాంకు రుణాలకు వెళ్లవద్దని ఇరిగేషన్ శాఖామంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శనివారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని పలు అభివృద్ధి పనులపై మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనుల్లో అలసత్వం తగదని ప్రజలకు ఇబ్బంది లేకుండా విధులు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ టిడ్కో గృహాలకు సంబంధించి టీడీపీ ప్రభుత్వం హయాంలో 90 శాతం నిర్మాణాలు పూర్తయితే గత వైసీపీ ప్రభుత్వంలో రూపాయి పని కడాఅ చేపట్టలేదని విమర్శించారు. బ్యాంకులో తాకట్టు పెట్టి లబ్ధిదారులను రుణగ్రస్తులను చేయడంతో పాటు ఆ సొమ్ములను జగన్ ప్రభుత్వం మళ్లించుకుందన్నారు. బ్యాంకు రుణాలు పొందని లబ్ధిదారులు 500 మంది ఉన్నారని వారంతా బ్యాంకుల్లో రుణాలు తీసుకోనవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. మిగిలిన 10 శాతం పనులు పూర్తిచేసి కాలనీలో మౌళిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మున్సిపల్ కమిషనర్ బి.విజయసారధి, డిఈ. రాజకుమార్, టీపీవో కె.వీరబ్రహ్మం, ఆర్వో ఎ.శ్రీనివాసరాజు, ఏఈలు సాంబశివుడు, జి.సతీష్, కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, ఉన్నమట్ల కబర్ధి, బోనం చినబాబు, గండేటి వెంకటేశ్వరరావు, జక్కంపూడి కుమార్, కర్నేన గౌరునాయుడు పాల్గొన్నారు.


ఉండి మండలం వాండ్రంలో ఆంధ్రప్రదేశ్ ఫిష్ ట్రేడర్స్ అండ్ ప్యాకర్స్ అసోసియేషన్ నూతన భవనం ప్రారంభిస్తున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, మంతెన రామరాజు తదితరులు

ఆక్వా అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి
కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

ఉండి ఆగస్టు 10: ఆక్వారంగ అభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సంసిద్ధంగా వున్నాయని ఆక్వా రైతుల సంక్షేమమే ప్రభుత్వాలు ధ్యేయమని కేంద్ర ఉక్కుగనుల, భారీ పరిశ్రమల సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. శనివారం ఉండి మండలం వాండ్రం రైల్వేగేటు అవతల ఆంధ్రప్రదేశ్ ఫిష్ అండ్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.10 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన నూతన భవనాన్ని కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ ప్రారంభించారు.ఉండి, ఉంగుటూరు ఎమ్మెల్యేలు రఘురామకృష్ణరాజు, పత్సమట్ల ధర్మరాజులు మాట్లాడుతూ ఆక్వారైతుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక కార్యచరణతో వున్నారన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, కైకలూరు, భీమవరం ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, పులపర్తి రామాంజేయులు మాట్లాడుతూ ఆక్వా రంగం వల్లే భీమవరానికి దేశవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందన్నారు. ఆక్వా రైతులకు నాణ్యమైన ఫీడ్, సీడ్ అందించి మేత ధరలు తగ్గించేందుకు సీఎం ఆదేశాలు జారీ చేశారన్నారు. జోన్‌తో సంబంధం లేకుండా విద్యుత్ సబ్సిడీ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందన్నారు. భవన నిర్మాణానికి సహకరించిన దాతలను సన్మానించారు. ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉద్దరాజు కృష్ణప్రసాద్, మహమ్మద్ మదనీ, పద్మనాభరాజు, గాదిరాజు సుబ్బరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, వాండ్రం సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ, ఆక్వారైతులు పాల్గొన్నారు.

రేపు రైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ము : పితాని

పెనుమంట్ర, ఆగస్టు 10 : దాళ్వా ధాన్యం సొమ్ము రాష్ట్ర ప్రభుత్వం రూ.660 కోట్లు బకాయి పడిందని ఇది సోమవారం రైతుల ఖాతాల్లో జమ చేస్తారని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ చెప్పారు. రైతు సంఘం నాయకులు ధాన్యం సొమ్ము జమ కాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన వెంటనే రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో ఫోన్లో మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు రూ.200 కోట్లు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రూ.300 కోట్లు వివిధ జిల్లాలకు రూ.165 కోట్లు ధాన్యం సొమ్ము సోమవారం బ్యాంకు ఖాతాలో జమవు తుందని చెప్పారు.

అందుబాటులో ఇసుక

భీమవరం టౌన్, ఆగస్టు 10 : జిల్లాలో ఇసుక రీచ్‌లు అందుబాటులో లేని కారణంగా పొరుగు జిల్లాలనుంచి ఇసుకను లబ్ధిదారులు అవసరం మేరకు పొందవచ్చునని కలెక్టర్ నాగరాణి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం ఉసులు మర్రులో 12,545 మెట్రిక్ టన్నులు, పెండ్యాల - 1,19,150 మెట్రిక్ టన్నులు, నిడదవోలు మండలం పందలపర్రు- 42,208 మెట్రిక్ టన్నులు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం రావులపాడు-1లో 3,789 మెట్రిక్ టన్నులు, రావులపాడు-2లో 1,700 మెట్రిక్ టన్నులు ఇసుక శనివారం నాటికి అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఆహో..!
ఆటపాక పక్షుల కేంద్రానికి కొత్త అందాలు
రూ.20 లక్షల వ్యయంతో వసతుల ఏర్పాటు
పక్షుల కోసం 60 కృత్రిమ ఐరన్ స్టాండ్లు.. వీఐపీలకు గెస్ట్‌హౌస్

కైకలూరు, ఆగస్టు 10: సహజ సిద్ధంగా ఏర్పడిన కొల్లేరు సరస్సు విదేశీ పక్షులకు ఆలవాలం. నిత్యం పర్యాటకంతో సందడిగా ఉంటుంది. గత ప్రభుత్వం ఏవిధమైన చర్యలు తీసుకోకపోవడంతో ఉన్న వసతులు కూడా తుప్పుపట్టి పోయాయి. ఏలూరు జిల్లాలో 77,136 ఎకరాల్లో విస్తరించి ఉన్న కొల్లేరు సరస్సులో ఆటపాక పక్షుల కేంద్రం పర్యాటకంగా పేరొందింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పక్షుల కేంద్రానికి రూ.20 లక్షల వ్యయంతో అభివృద్ధి పనుల చేపట్టారు. పక్షుల ఆవాస కేంద్రాలను ఏర్పాటు, పర్యాటకులు సేద తీరేందుకు సిమెంటు బల్లలు, బోట్లు మరమ్మతులు వంటివి చేపట్టారు. వీఐపీలు వచ్చిన సమయంలో విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాట్లను నిర్వహించారు. విదేశీ పక్షులు ఆవాస కేంద్రాలను ఏర్పాటు చేసుకునేందుకు 60 కృత్రిమ ఐరన్ స్టాండ్లు, 30 సిమెంటు బల్లలను ఏర్పాటు చేశారు. లైఫ్ జాకెట్‌లను కొనుగోలు చేశారు. పర్యాటకులకు ప్రైవేటు గెస్ట్‌హౌస్ ఏర్పాటు చేశారు. గతంలో కృత్రిమ ఐరన్ స్టాండ్లు లేకపోవడంతో పక్షుల ఆవాస కేంద్రాలకు చోటు లేకపోవడంతో వేరే ప్రాంతా లకు వెళ్లిపోయేవి. కొత్తగా స్టాండ్లు ఏర్పాటు చేయడంతో మరిన్ని పక్షులు కొల్లేరు సరస్సుకు వస్తాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఈడీసీ కేంద్రం వద్ద ప్రహరీగోడలపై పక్షుల చిత్రపటాలు పిల్లలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. బోటు షికారుతో పాటు పక్షుల నమూనాలను తెలిపే విధంగా పెయింటింగులు ఏర్పాటు చేశారు.


పక్షుల ఆవాసానికి కొత్తగా ఏర్పాటు చేసిన ఇనుప స్టాండ్లు


పక్షుల కేంద్రంలో గోడలపై ఆకట్టుకుంటున్న పెయింటింగ్‌లు



చిల్డ్రన్స్ పార్క్‌లో కొలువుదీరిన ఆట పరికరాలు


పక్షుల కేంద్రంలో కనువిందు చేస్తున్న విదేశీ పక్షులు


కొత్తగా వచ్చిన విద్యార్థులకు అడ్మిషన్లు అందజేస్తున్న అధికారులు

నిట్‌లో బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థుల ప్రవేశం

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 10 : ఏపీ నిట్‌లో బీటెక్ ప్రథమ సంవత్సర విద్యార్థులు వస్తున్నారు. దీంతో ప్రాంగణం మొత్తం సందడిగా మారింది. బీటెక్‌లో మొత్తం 480 సీట్లు ఉన్నాయని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేష్‌శంకర్‌రెడ్డి తెలిపారు. వీటిలో 50 శాతం సీట్లు రాష్ట్ర విద్యార్థులతోనూ , మిగిలిన వాటిని ఇతర రాష్ట్రాల విద్యార్థులతోనూ జోసా, సీ-సాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తున్నామన్నారు. కౌన్సిలింగ్‌లో మొత్తం 480 సీట్లకు అలాట్‌మెంట్ పూర్తి అయ్యిందన్నారు. సీటు అలాట్‌మెంట్ పొందిన విద్యార్థులు తమ కుటుంబసభ్యులతో నిట్‌కు వచ్చి ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలన చేయించుకోవడంతో పాటు ఫీజులు చెల్లించి ప్రవేశాలు పొందుతున్నారన్నారు. నిట్ ఇన్‌చార్జి డైరక్టర్ ఆధ్వర్యంలో ఈ ప్రవేశాలు జరగగా, సెంటర్ ఇన్‌చార్జిగా డీన్ అకడమిక్ డాక్టర్ టీ.కురుమయ్య, సెంటర్ ఇన్‌చార్జులుగా డాక్టర్ తపస్ పరమానిక్, డాక్టర్ రాముడు వ్యవహరించారు. తొలిరోజు 54 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు.

ట్రిపుల్ ఐటీలో 309 సీట్లు ఖాళీ

నూజివీడు టౌన్, ఆగస్టు 10: ఆర్జీయుకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మొదటి, రెండు విడతల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తికాగా 309 సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. మొత్తం నాలుగు క్యాంపస్‌లకుగాను 4 వేల ట్రిపుల్ ఐటీ సీట్లకు మరో 400లు సూపర్ న్యూమరీ సీట్లు కలిపి 4,400 సీట్లకు ఆర్జీయూకేటీ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించింది. నాలుగు క్యాంపస్‌ల మీద 753 సీట్లు మిగలగా రెండో విడత కౌన్సెలింగ్‌లో 444 సీట్లు భర్తీ అయ్యి 309 సీట్లు మిగిలాయి. వీటికి త్వరలో మూడో విడత కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి ప్రత్యేక రైళ్లు

ఏలూరు క్రైం, ఆగస్టు 10 : స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని దక్షిణ మధ్య రైల్వే పది ప్రత్యేక రైళ్ళను నడుపుతోంది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ రైళ్ళను నడుపుతున్నట్లుగా రైల్వే అధికారులు తెలిపారు.

07653 కాచిగూడ - తిరుపతి ఈనెల 14 నుంచి 16 వరకూ
07654 తిరుపతి - కాచిగూడ ఈనెల 15 నుంచి 17 వరకూ
07453 మచిలీపట్టణం - వికారాబాద్ ఈనెల 13 నుంచి 15 వరకూ
07454 వికారాబాద్ - మచిలీపట్టణం ఈనెల 14 నుంచి 16 వరకూ
07069 హైదరాబాద్ - సత్రగంజి ఈనెల 14వ తేదీ
07070 సత్రగంజి - హైదరాబాద్ ఈనెల 15వ తేదీ
07698 నర్సపూర్ - నాగర్‌సోల్ ఈనెల 13వ తేదీ
07699 నాగర్‌సోల్ - నర్సాపూర్ ఈనెల 14వ తేదీ
07517 నర్సపూర్ - సికింద్రాబాద్ ఈనెల 15వ తేదీ
07518సికింద్రాబాద్ -నర్సపూర్ ఈనెల 16న రైళ్లను నడుపుతున్నారు.

అంబేడ్కర్ విగ్రహ ధ్వంసానికి ప్రయత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి
శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు


విలేకరుల సమావేశంలో మట్లాడుతున్న మోషేన్‌రాజు

భీమవరంటౌన్, ఆగస్టు 10 : విజయవాడలో నిర్మించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహ సముదాయంలోకి కొంత మంది వ్యక్తులు ప్రవేశించి విగ్రహ ధ్వంసానికి ప్రయత్నించి శిలాఫలకం తొలగించడం బాధాకరమని, వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకో వాలని ఏపీ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. భీమవరంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలోనే అత్యున్నత ఆదరణ కలిగిన అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించడం రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చడమేనన్నారు. దేశ నాయ కులు, రాజకీయనాయకుల విగ్రహాలకు రక్షణ కల్పించాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. అంబేడ్కర్ స్మృతి వనం జోలికి వెళ్లడం అంటే రాజ్యాంగంపై దాడిగా భావించాన్నారు.


ఉచిత దర్శనం క్యూలైన్ దాటి బయట బారులు తీరిన భక్తులు

చిన వెంకన్న క్షేత్రానికి భక్తుల తాకిడి

ద్వారకాతిరుమల, ఆగస్టు 10: గోవింద నామాలతో చినవెంకన్న క్షేత్రంలో ఆధ్యాత్మికత సంతరించుకుంది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడం అందులోనా రెండో శనివారం అవడం వల్ల క్షేత్రానికి విశేషసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక ప్రారంభమైంది.దీంతో ఆలయంలోని అన్ని విభాగాలు యాత్రికులతో నిండిపోయాయి. స్వామివారి ఉచిత దర్శనానికి దాదాపు రెండుగంటల పైబడి సమయం పట్టింది. సుమారు 20 వేల మంది వరకూ భక్తులు వచ్చినట్లు ఆలయ అధికారుల అంచనా.దర్శనం అనంతరం భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

రూ. 3 కోట్ల విలువైన ఆలయ స్థలం స్వాధీనం

భీమవరం టౌన్, ఆగస్టు 10 : పట్టణంలోని భీమేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన భూమి 13 సెంట్లను శనివారం హైకోర్టు ఉత్తర్వుల మేరకు దేవదాయ జిల్లా అధికారి ఈదుల వెంటక సుబ్బారావు పర్యవేక్షణలో స్వాధీనం చేసున్నట్టు ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ స్థలం విలువ 3 కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. ఆలయానికి ఉత్తరం వైపు ఉన్న భూమిపై అర్చక సర్వీసు వంతుదారుడైన కొత్తలంక శ్రీనివాసరావు హైకోర్టులో పిటిషన్ వేసిన నేపథ్యంలో వాదనలు విన్న తరువాత హైకోర్టు సంబంధిత పిటిషన్‌ను డిస్మిస్ చేసిందని దాంతో స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు స్థలం ఆక్రమణకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు.



కేంద్ర మంత్రులకు ఎంపీ మహేష్ వినతి

ఏలూరు రూరల్, ఆగస్టు 10: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి కేంద్రమంత్రులు ప్రహ్లాద్ జోషి, హరిదీప్‌సింగ్ పూరీలను ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కలిశారు. రాష్ట్రానికి పప్పుధాన్యాలు ఎక్కువగా కేటాయించాలని, రాష్ట్రంలో కొత్తగా 8 ధరల నివేదన కేంద్రాల ఏర్పాటుకు ధరల స్థిరీకరణ నిధి రూ.532 కోట్లు కేటాయించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలోని హర్యానా భవన్‌లో ఆ రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయను ఎంపీలు మహేష్‌కుమార్ ఎం.భరత్, మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఉదయ్ శ్రీనివాస్, కృష్ణప్రసాద్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు.

13న పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం
కలెక్టర్ నాగరాణి



భీమవరం టౌన్, ఆగస్టు 10: సొంతంగా ఆధునిక యంత్రాలు సమకూర్చుకోలేని సందర్భంలో సారూప్య పరిశ్రమలు ప్రత్యేక ప్రయోజన సమాఖ్యగా (ఎస్‌పివి) ఏర్పడి క్లస్టర్ డెవలప్మెంట్ పథకంలో యంత్రాలు సమకూర్చుకోవడానికి అవకాశం ఉందని యాజమాన్యాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. దీనిపై అవగాహన కలిగించేందుకు పరిశ్రమల ప్రతినిధులతో ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఒకే రకమైన కార్యకలాపాలు నిర్వహిస్తూ దగ్గర దగ్గరగా సుమారు 10, 15 పరిశ్రమలు వున్న చోట అందరికీ ఉపయోగపడేలా క్లస్టర్ డెవలప్మెంట్ ద్వారా కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుతో ప్రయోజనం పొందవచ్చన్నారు ఐదు నుంచి పది కోట్ల వరకు ప్రాజెక్టు విలువ కలిగిన పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వ గ్రాంటు 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వ గ్రాంటు 20 శాతం, పరిశ్రమల యాజమాన్యం వాటా 10 శాతం, అలాగే 10 నుంచి రూ. 30 కోట్లు విలువ కలిగిన పరిశ్రమలకు కేంద్ర గ్రాంటు 60 శాతం, రాష్ట్ర గ్రాంటు 20 శాతం యాజమాన్యం వాటా 20 శాతంతో కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తారని తెలిపారు. ఇతర సమాచారం కోసం జిల్లా పరిశ్రమల శాఖ అధికారి మంగపతిరావును99592 56522 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

భీమవరం టౌన్, ఆగస్టు 10 : భీమవరం పట్టణంలోని 11వ వార్డు వార్డు సచివాలయంలో ఎడ్యుకేషన్ డేటా ప్రొసెసింగ్ సెక్రటరీగా పనిచేస్తున్న రాఘవను సస్పెండ్ చేసినట్లు మునిసిపల్ కమిషనర్ శ్యామల తెలిపారు. ఈనెల 1వ తేదీన పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహించి జాప్యానికి కారణమైనందున ఈ చర్యలు తీసుకున్నట్టు తెలిపారు.

క్రైం కార్నర్

చెట్టును ఢీకొట్టిన ఆటో
ఐదుగురికి గాయాలు



ప్రమాదంలో గాయపడినవారు

పెదవేగి, ఆగస్టు 10 : ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి రహదారి పక్కన చెట్టును ఢీకొట్టి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు గాయాలతో ఆస్పత్రి పాలైనట్టు పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఏలూరు నుంచి చింతలపూడి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో పెదవేగి మండలం రామచంద్రపురం అడ్డరోడ్డు దాటిన తరువాత వేరొక వాహనాన్ని తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనదారుడు ఆటో వైపు వేగంగా రావడంతో ఆటోను రహదారి మార్జిన్‌లోకి దించాడు. మార్జిన్ మొత్తం బురదతో ఉండడంతో ఆటో అదుపు తప్పి సమీపంలో ఉన్న చెట్టు మోడును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చింతలపూడి మండలం దేశవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కాపుదాసి రవికుమార్, డ్రైవర్ పక్కనే ఉన్న దేశవరం గ్రామానికే చెందిన కాపుదాసి భాస్కరరావులు తీవ్రంగా గాయపడ్డారు. లింగపాలెం మండలం సుందరావుపేటకు చెందిన కాట్రు మరియమ్మ, ముసునూరు మండలం వేల్పుచర్లకు చెందిన తాళ్లూరి కాంతమ్మ, బండి శైలజలు గాయపడ్డారు.సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

మత్తిచ్చి మేకలను ఎత్తుకుపోదామనుకున్నారు..
పట్టుకుని పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు


సచివాలయంలో బంధించిన అనుమానితులు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 10: మేకలకు మత్తిచ్చి ఎత్తుకుపోదామని వచ్చిన దొంగలను గ్రామస్థులు పోలీసులకు పట్టించిన ఘటన తాడేపల్లిగూడెం మండలంలోని కడియద్దలో శనివారం చోటు చేసుకుంది. కడియద్దలో మేకలు మేపే కాలనీలో ఐదుగురు వ్యక్తులు మేకలకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి మేకలను వ్యాన్‌లో తర లించేందుకు సిద్ధమయ్యారు. స్థానికులు గుర్తించి వారిని వెంబడించి పట్టుకు న్నారు. వెంటనే వారిని గ్రామ సచివాలయానికి తరలించి దేహశుద్ధి చేశారు. వారిలో ఒకరు నూజివీడుకు చెందిన వంట మాస్టారు కాగా మరో నలుగురు అదే ప్రాంతానికి చెందినవారిగా గుర్తిం చారు. ఈ ప్రాంతంలో మేకలు ఉన్న సమాచారం తెలుసుకుని చోరీకి యత్నించినట్టు గుర్తించారు. వీరిని రూరల్ పోలీసులకు అప్పగించారు. దీనిపై రూరల్ ఏఎస్సై గోపీనాథ్‌ను వివరణ కోరగా అనుమానితులను స్టేషన్‌కు తీసుకువచ్చామని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 10 : వివాహిత అయిన తన కుమార్తె కనబడటం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మంగయ్య తెలిపారు. తన కుమార్తెకు భర్తతో కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆగస్టు 1న పంగిడిగూడెంలోని తన తల్లి ఇంటికి వచ్చింది. ఈనెల 8వ తేదీన కుమార్తె ఇంటి దగ్గర కనబడ లేదు. చుట్టుపక్కల చూసినా ఫలితం లేకపోయేసరికి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. పంగిడిగూడెం గ్రామానికి చెందిన తంగెళ్లరెడ్డి అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఏఎస్సై తెలిపారు.

యువకునిపై ఫోక్సో కేసు

ఏలూరు క్రైం, ఆగస్టు 10 : ఇంటర్మీడియట్ చదివే ఒక యువతికి మాయ మాటలు చెప్పి మోటారు సైకిల్‌పై తీసుకువెళ్ళిన యువకునిపై ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కృష్ణా జిల్లాకు చెందిన ఒక యువతి (16) ఏలూరులో ఒక కళాశాలలో ఇంటర్మీడియట్ చదువు తుంది. రోజూ బస్సులో వెళ్ళి వస్తుంది. కృష్ణాజిల్లా బాపులపాడు మండలం రేపమల్లికి చెందిన మాలవతు శ్రీరామ్‌నాయక్ (21) అనే యువకుడు ఆ యువతిని రోజూ వేధింపులకు గురిచేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఈనెల 8వ తేదీన కాలేజీకి వెళ్ళిన ఆ యువతిని బెదిరించి తన మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని నూజివీడువైపు వెళ్తుండగా బంధువులు చూసి ఆ యువతి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయువతిని తీసుకువచ్చి జరిగిన విషయం తెలుసుకుని ఏలూరు త్రిటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శ్రీరామ్‌నాయక్‌పై ఫోక్సో కేసు నమోదు చేశారు. యువతిని వేధించి, బెదిరించి కిడ్నాప్ చేశారని కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని ఒకనికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, ఆగస్టు 10 : మోటారు సైకిల్‌పై వెళ్తున్న దంపతులను అతి వేగంగా ఎదురుగా వచ్చిన బీఎండబ్ల్యు కారు ఢీకొనడంతో ఒకనికి కాలు విరిగిపోయింది. ఏలూరులోని కత్తేపువీధినకు చెందిన షేక్ ములాలీ, అతని భార్య షేక్ మెహ్రాజ్ కలిసి బుల్లెట్‌పై ఏలూరు మినీ బైపాస్ రోడ్డులోని ఒక దాబాకు వెళ్ళి టిఫిన్ చేశారు. తిరిగి ఇంటికి వెళ్ళే నిమిత్తం మోటారు సైకిల్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో రామకృష్ణాపురం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడి వద్ద ఎదురుగా వస్తున్న కారు అతి వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో మౌలాలి కాలు విరిగింది. మెహ్రాజ్ గాయాలపాలైంది. ఏలూరు త్రిటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

విస్తృతంగా వాహన తనిఖీలు

ఏలూరు క్రైం, ఆగస్టు 10 : అక్రమ రవాణాదారుల గుండెల్లో రైళ్ళు పరిగెత్తేలా ఏలూరు జిల్లా వ్యాప్తంగా పోలీస్ మార్క్‌ను శనివారం సాయంత్రం చూపించారు. జిల్లా ఎస్పీ కిషోర్ ఆదేశాలతో జిల్లాలోని డీఎస్పీల నుంచి హోంగార్డు వరకూ అందరూ శనివారం సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకూ అన్ని ప్రాంతాల్లోనూ ఏకకాలంలో విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, మత్తుపదార్థాలు, సారా, అక్రమ ఇసుక, ఇతర ప్రాంతాల మద్యం రవాణా కాకుండా ఈ తనిఖీలు నిర్వహించారు. అతి వేగంగా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులను, శబ్ద కాలుష్యాన్ని సృష్టించే ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను కలిగి ఉన్న వాహనాలను వెంటనే గుర్తించి ఆ సైలెన్సర్లను తొలగించారు. హెల్మెట్ ఖచ్చితంగా ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్సు, వాహనాలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. రికార్డులలు సక్రమంగా లేని వాహనాలను స్టేషన్లకు తరలించారు.

డెంగీతో ప్రభుత్వాసుపత్రి ఉద్యోగి మృతి



ఏలూరు క్రైం, ఆగస్టు 10 : ఏలూరు పత్తేబాదకు చెందిన దాండే శాంతకుమారి (54) డెంగీ జ్వరంతో మృతి చెందారు. శాంతకుమారి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోని ట్రామాకేర్ విభాగంలో అవుట్ సోర్సింగ్ ఎఫ్ఎన్‌వోగా పనిచేస్తున్నారు. రెండు రోజుల నుంచి ఆమె జ్వరంతో బాధపడుతూ ఈనెల 9వ తేదీన ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. సాయంత్రానికి ఆమె పరిస్థితి మరింత విషమించడంతో వెంటనే నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్ళారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించగా ఆమెకు డెంగీ పాజిటివ్ అని వెల్లడైంది. దీంతో అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. ఆసుపత్రి ఉద్యోగులు తీవ్ర విషాదానికి గురయ్యారు. శాంతకుమారికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు చెబుతున్నారు.

ఆక్వా హబ్‌ను పరిశీలించిన ఎఫ్ఏవో టీం

కలిదిండి, ఆగస్టు 10 : కలిదిండిలో శనివారం ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనై జేషన్‌టీం ఆక్వా హబ్‌ను సందర్శించింది. రైతుల నుంచి చేపలు కొనుగోలు చేసి వాటిని ఏ విధంగా ప్రాసెసింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోగేశ్వరం లంకలో 5 ఎకరాల రొయ్యల చెరువును పరిశీలించారు. రొయ్యల సాగు విధానాన్ని ఆక్వా రైతును అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.

ఏడు వేల జనసేన సభ్యత్వాల నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 10 : స్థానిక పవరుపేటలోని జనసేన కార్యాలయంలో శనివారం జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు జనసేన క్రియాశీల సభ్యత్వం నమోదు చేయించిన వలంటీర్లతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. అప్పలనాయుడు మాట్లాడుతూ ఏలూరులో 18 రోజులుగా 7,583 పైచిలుకు సభ్యత్వాలు నమోదు చేయించడం అభినందనీయ మన్నారు. జనసేన నాయకులు నగిరెడ్డి కాశీనరేష్, సరిది రాజేష్, కస్తూరి సాయితేజశ్విని, ఒబిలిశెట్టి శ్రావణకుమార్ గుప్తా, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి చేయాలని జేసీకి వినతి



జేసీకి మొక్క అందజేస్తున్న దృశ్యం

టి.నరసాపురం, ఆగస్టు 10: ప్రమాదభరితంగా తయారైన చింతలపూడి - టి.నరసాపురం ప్రధాన రహదారి అభివృద్ధి చేయాలని మండల పరిధిలోని రోడ్లు, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ టి.నరసాపురం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాసర్ పాషా, జనసేన పార్టీ నాయకులు పాలేటి సత్తిబాబు శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డిని, ఏలూరు కలెక్టర్ కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేసినట్లు విలేకర్లకు తెలిపారు. ముందుగా నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జేసీకి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారివెంట సామాజిక కార్యకర్త జమీల బేగం పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి వీల్‌చైర్ అందజేత



డాక్టర్ శ్రీనివాస్‌కు వీల్ చైర్‌ను అందజేస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

ఏలూరు క్రైం, ఆగస్టు 10 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా భీమ వరం, ఏలూరు జిల్లాల్లో ఉన్న మహిళా పోలీస్ స్టేషన్ల డీఎస్పీ సున్నా మురళీకృష్ణ ఏలూరు ప్రభుత్వా స్పత్రికి వీల్ చైర్‌ను శనివారం అందజేశారు. డీఎస్పీ మురళీకృష్ణ సాధారణంగా కేసుల నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన సమయంలో ఎంసీహెచ్ బ్లాక్‌లో వీల్‌చైర్ లేక గర్భిణులు, అంబులెన్సులో దిగిన వారు ఇబ్బందిగా ఉండడా న్ని మీడియా ఆయన దృష్టికి తీసుకువెళ్ళింది. దీంతో అతన అత్త స్వర్గీయ జుజ్జవరపు రత్నమణి జ్ఞాపకార్థం ఆమె జయంతిని పురస్కరించుకుని వీల్‌చైర్‌ను శనివా రం ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చి ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏఆర్ఎస్ శ్రీనివాస్‌కు అందజేశారు. డీఎస్పీ మురళీకృష్ణకు డాక్టర్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ కాంతిప్రియ, సిబ్బం ది హెడ్‌కానిస్టేబుల్స్ కృష్ణ, శ్రీనివాసరావు, నాగలక్ష్మి, ఆసుపత్రి ఔట్‌పోస్టు హెడ్‌కాని స్టేబుల్ పి.కనకాంబరం పాల్గొన్నారు.

ఉపాధిలో అవకతవకలపై విచారణ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకరరావు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 10 : మండలంలో ఉపాధి హామీ పథకంలో జరుగు తున్న అవకతవకలపై అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎ.ప్రభాకర రావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు యాగంటి సీత అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రభాకరరావు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాన్ని అమలు చేయడంలో అధికారులు విఫలమ య్యారన్నారు. కూలీలకు పే స్లిప్పులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అక్రమాలకు పాల్పడే అధికారులపై చర్యలు తీసుకోవాలని లేదంటే జిల్లా కలెక్టరు కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. జె.సూర్యచంద్రరావు, పి.చంటి, సుబ్బారావు, నరసారావు, గంగరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాడిపూడి కాలువ పనులు పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ద్వారకాతిరుమల, ఆగస్టు 10: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లోని రెండు లక్షల ఎకరాలకు సాగునీరందించే తాడిపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తికాక పోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎం.నాగులపల్లిలో శనివారం ఈ పథకం ఆయకట్టు రైతుల సమావేశం జరిగింది. శ్రీనివాస్ మాట్లాడుతూ ద్వారకా తిరుమల, దెందులూరు మండలాల్లోని వేలాది ఎకరాలకు దీని ద్వారా సాగునీ రందించే అవకాశం ఉన్నా ఏళ్ల తరబడి నిధులు అందక కాలువ పనులు పెండింగ్‌లో పడ్డాయన్నారు. రైతుల నుంచి భూసేకరణ జరిపి అరకొరగా పనులు చేసి చేతులు దులుపుకున్నారన్నారు. దీనివల్ల జంగిల్ పెరిగి అనేక చోట్ల కాలువ పూడుకు పోయిందన్నారు. రైతు సంఘ జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు మాట్లాడుతూ ఈనెల 12న కలెక్టరేట్ వద్ద మీకోసంలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు ఆయకట్టు రైతులు తరలి రావాలని కోరారు.

వసతి గృహానికి కుట్టు మెషీన్లు అందజేత



కుట్టు మెషీన్లు అందజేస్తున్న కృష్ణశ్యామ్

ఏలూరు రూరల్, ఆగస్టు 10: సమాజ సేవకు తామెప్పుడూ ముందుంటామని, దాతలకు అవసరమయ్యే కార్యక్రమాలకు చేయూతను అందిస్తామని ఎన్‌ఆర్‌ఐలు లింగం కృష్ణశ్యామ్, కొసరాజు సుధీర్ అన్నారు. సంకల్పం ట్రస్ట్ ఆధ్వర్యంలో కొసరాజు శశిరేఖ పేరుమీద శనివారం శనివారపుపేటలోని బాలుర వసతి గృహానికి రెండు కుట్టు మెషీన్లు, వెట్ గ్రైండర్, స్పోర్ట్స్ కిట్ అందజేశారు. న్యూజెర్సీ, షికాగోలో ఉంటున్న వీరు సంకల్పం ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు అందిస్తున్నారు. కొసరాజు రఘువంశీ, లింగం దేవదత్తా, అఖిల సుమిత్ర, హరిరాజు, వసతి గృహం ఇన్‌చార్జ్ బి.రంగారావు, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఏలూరు రూరల్, ఆగస్టు 10: స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా శనివారం మలేరియా విభాగం ఆధ్వర్యంలో 27వ డివిజన్‌లో చొది మెళ్ళతో పాటు పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, మురుగుకాలువ కల్వర్టు క్రింద ఫాగింగ్, నిల్వ నీటిలో ఆయిల్‌బాల్స్ వేశారు. ఎంహెచ్‌వో మాలతి, వేణుగోపాల్, మలేరియా అధికారులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల నిలుపుదల పై హర్షం

ఏలూరు రూరల్, ఆగస్టు 10: గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేస్తూ నిర్ణయం తీసుకోవడంపై రాష్ట్ర రెవెన్యూ అధికారుల సంఘం, రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థలో రెవెన్యూ, పీఆర్ శాఖలతో చర్చించకుండా అసంబద్ధ నిర్ణయాలు తీసుకోవడంతో సచివాలయ ఉద్యోగస్తులకు పదోన్నతుల ఛానెల్ లేకుండా పోయిందన్నారు. రిజిస్ట్రేషన్ శాఖను కాదని, సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ వైసీపీ అనాలోచిత నిర్ణయమని విమర్శించారు. పంచాయతీరాజ్, సచివాలయ, రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేయటం శుభపరిణామం అన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

» యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకల్లో పలువురు వక్తలు

» ఘనంగా స్వర్ణోత్సవాలు



ఏలూరులో దివంగత నాయకుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ జిల్లా ప్రతినిధులు

ఏలూరు అర్బన్, ఆగస్టు 10 : యూటీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం ఏలూరులోని సంఘ జిల్లాకార్యాలయంలో స్వర్ణోత్సవాలను నిర్వహించారు. తొలుత సంఘ పతాకావిష్కరణ అనంతరం జరిగిన సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్‌ముస్తఫాఆలీ, రవికుమార్ మాట్లాడుతూ ఐదు దశాబ్దాల సంఘ చరిత్రలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, సౌకర్యాల కల్పనకు ప్రభుత్వంపై పోరాటంతోనే సాధించుకున్నామన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు మంచి చదువు అందించడానికి ప్రాధాన్యతనిచ్చామన్నారు. స్వర్ణోత్సవాల సందర్భంగా త్వరలో టీచర్లకు పాటలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నామని, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో వివిధ కార్యక్రమాలు, మహాసభలు డిసెంబరు వరకు జరుపుతామని వెల్లడించారు. సంఘ దివంగత నాయకులకు నివాళులర్పించారు. యూటీఎఫ్ నాయకులు రంగమోహన్, రాంబాబు, సుదారాణి, కమల్‌కుమార్, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యారంగ పరిరక్షణ కోసం యూటీఎఫ్ ఎన్నో పోరాటాలు చేసిందని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎంవీ శ్యాంబాబు అన్నారు. స్థానిక భవనంలో యూ టీఎఫ్ ఆవిర్భవించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యాంబాబు యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఇప్పటి వరకు సాధించిన విజయాలను వివరించారు. జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు, మండల ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణ, మడకం పోశమ్మ, ఐవీఎస్ఆర్‌కే. ప్రసాద్, ఏసురత్నం, సోమేశ్వరరావు, అజ్గర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి :స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను రిటైర్డ్ సభ్యులు జె.సూరారెడ్డి, తేరేజమ్మ ఆవిష్కరించారు. యూటీఎఫ్ ఆవిర్భవించి 51వ సంవత్సరంలో అడుగుపెట్టిందని, పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని, యూటీఎఫ్ రుజువు చేసిందని సూరారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి.శ్రీనివాస్, బుచ్చిబాబు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు రాయితీలు ఇవ్వాలి



అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ సభలో మాట్లాడుతున్న సురేష్

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 10 : స్థానిక ఎన్ఆర్‌పేటలోని సీఐటీయు భవనంలో శనివారం దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయు ఏలూరు సిటీ కో-ఆర్డినేటర్ భలే సురేష్ అధ్యక్షత వహించి మాట్లాడారు. గిరిజన సంప్రదాయాలను కాపాడాలని, అడవులను పరిరక్షించాలని ఆదివాసీలకు రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఐఓ రంగయ్య, ప్రోగ్రాం మేనేజర్ శామ్యూల్ అనీల్ కుమార్, సీనియర్ న్యాయవాది కట్టా సత్యనారాయణ, ఎస్సీ ఎస్టీ మోనిటరింగ్‌కమిటీ సభ్యులు మేతర అజయ్‌బాబు, సోషల్ సర్వీస్ సెంటర్ కో-ఆర్డినేటర్ ఎన్.వీరాస్వామి, ఎస్.కాసు, డిబిఆర్‌సి సిబ్బంది సింగవరపు జ్యోతి, గోసాల ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ గిరిజన దినోత్సవం

ఏలూరు రూరల్, ఆగస్టు 10: స్థానిక గిరిజన లంబాడా భవన్‌లో ఎస్టీ బంజారా, సుగాలి, లంబాడి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవం వేడుకలు శనివారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు బూక్యా నాగేశ్వర నాయక్ హాజరై మాట్లాడారు. మొట్టమొదటిసారి గిరజన దినోత్సవానికి సీఎం చంద్రబాబు హాజరుకావడంపై హర్షం వ్యక్తం చేశారు. గిరిజనులను గుర్తించి వారి సంప్రదాయాలకు పెద్దపీట వేయాలని కోరారు. లంబాడీలకు ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇ.బాలాజి, బూక్యా రాము, డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌కు తాళాలా?



ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 10 : ఏలూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో లయనెస్ క్లబ్ మహిళల సౌకర్యార్థం లక్షలాది రూపాయలతో మరుగు దొడ్లు, మూత్రశాలలు నిర్మించారు. అయితే ఈ సముదాయం ప్రారంభించి దాదాపు పదేళ్ళు కావస్తున్నా కొద్ది రోజులు మాత్రమే వాడకలో ఉంచి అనంతరం వీటికి తాళాలు వేశారు. దీంతో నిరుపయోగంగా ఉంది. మరుగుదొడ్లకు తాళాలు వేయడం, సముదాయం వద్ద ఎటువంటి నీటి సౌకర్యం లేకపోవడంతో దీనిని మహిళలు వినియోగించు కోవడం లేదు. హేలాపురి లయనెస్ క్లబ్ నిర్మించి సంస్థకు అప్పగించినప్పటికి పర్యవేక్షణ కరువైందని, ఇప్పటికైనా మహిళల వినియోగానికి అమలులోకి తీసుకు రావాలని తెలిపారు.



చింతలపూడి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే రోషన్ కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామకుమార్

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు



ధర్మాజీగూడెంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ చెన్నారావు

లింగపాలెం, ఆగస్టు 10:వాహనదారులు వాహనానికి సంబంధించి సరైన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని, ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ధర్మాజీగూడెం ఎస్సై పి.చెన్నారావు అన్నారు.విజువల్ పోలీసింగ్‌లో భాగంగా ధర్మాజిగూడెంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తమ వాహనాలకు సంబంధించి సరైన ధ్రువపత్రాన్ని వెంట ఉంచుకోవాలని, లేదంటే వారికి చెలానాలు విధిస్తామని అన్నారు. అలాగే ద్విచక్ర వాహనదారులు ప్రతిఒక్కరూ హెల్మెట్‌ను ధరించాలని, వాహనాలకు సంబంధించి ధ్రువ పత్రాలను సక్రమంగా ఉంచుకోవాలని అన్నారు. మైనర్లు వాహనాన్ని నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రుల పై కూడా కేసులు నమోదుచేస్తామని ఆయన హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే వాహనదారులు జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. అయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

పెదపాడు, ఆగస్టు 10 : వాహనదారులకు ట్రాఫిక్ నిబంధ నలపై అవగాహన ఉండాలని పెదవేగి సీఐ నబి అన్నారు. కలపర్రు టోల్‌గేట్ వద్ద ఎస్సై కె.శుభశేఖర్ తో కలిసి శనివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. అనంతరం సీఐ నబి మాట్లాడుతూ హెల్మెట్ వాహపదారుల ప్రాణాలపే కాపాడుతుం దన్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిం చడంలో పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు.

● జంగారెడ్డిగూడెం : బైపాస్ రోడ్డులో డీఎస్పీ యు.రవిచంద్ర ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ చేశారు. లైసెన్సులు, హెల్మెట్లు లేని వాహనదారులకు అవగాహన కల్పించడంతో పాటు జరిమానాలు వేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవిచంద్ర మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గంజాయి, మద్యం, సారా, ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. సీఐ పి.రాజేష్, ఎస్సై జ్యోతిబసు, సిబ్బంది పాల్గొన్నారు.

● పోలవరం : స్థానిక కన్నాపురం అడ్డరోడ్డు వద్ద పోలవరం ఎస్‌ఐ ఎస్.పవన్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నేషనల్ హైవే 365 బీటీ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. 25 మంది వాహనదారులకు ఈ-చలానాలు విధించి, హెల్మెట్ ధారణపై- అవగాహన కల్పించామన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల రవాణా లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టామన్నారు. 12 మంది సిబ్బందితో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

● కొయ్యలగూడెం : వాహనచోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని పోలవరం డీఎస్పీ సురేష్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు శనివారం సాయంత్రం కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లో నిబంధనలు పాటించని పలు వాహనాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ద్విచక్రం వాహనం తోలేవాళ్ళు తప్పనిసరిగా హెల్మెట్ పెట్టుకోవాలని లేని ఎడల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హైవేలో వెళ్ళేటప్పుడు జాగ్రత్తగా నడపాలని ప్రతీ ఒక్కరు లైసెన్సు తీసుకోవాలని కోరారు. అదే విధంగా మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రుల పై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మధుబాబు, కొయ్యలగూడెం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్లతో వర్షపు నీరు తొలగింపు

పోలవరం, ఆగస్టు 10 :కొత్తపట్టిసీమలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీరు నిలిచిన నీటిని సర్పంచ్ మైగాపుల విజయదుర్గ, వీఆర్వో వినయ్, తాతి విజయ కుమారి ఆధ్వర్యంలో శనివారం నీటి తొలగింపు పనులు చేపట్టారు. మెషీన్లతో కచ్చా డ్రైన్లు తీయించి నాలుగు ఆయిల్ ఇంజన్లతో నీటిని తొలగించే పనులు చేపట్టారు. కొత్తనూతనగూడెంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిలిచిన నీటిని సర్పంచ్ పొడుం పుష్ప ఆధ్వర్యంలో కార్యదర్శి వై.కొండలరావు సిబ్బందితో నీటిని తొలగించారు.

వైసీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజీనామా



ఏలూరు క్రైం, ఆగస్టు 10 : వైసీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఏలూరుకు చెందిన ప్రముఖ న్యాయవాది చిన్నం స్టీఫెన్ సుధీర్ (సుధీర్ మాస్టార్) తన పదవికి రాజీనామా శనివారం చేశారు. వైసీపీ రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శిగా కొనసాగారు. తన రాజీనామాను శనివారం లీగల్‌సెల్ రాష్ట్ర కన్వీనర్లకు, వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడికి పంపించారు.

సీజనల్ వ్యాధులతో జర భద్రం

లింగపాలెం, ఆగస్టు 10: సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ యానిప్రీతి అన్నారు. ధర్మాజిగూడెంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జ్వరం, మలేరియా, చికెన్‌గున్యా లాంటి వ్యాధులు వస్తుండటంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రతిరోజూ ఫీవర్ సర్వే నిర్వహించాలన్నారు.

రేపు వికసన జయంతి వేడుకలు

నిడమర్రు ఆగస్టు 10 : వికసన మహాముని జయంతిని సోమవారం నిడమర్రు బాలవెంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు అర్చకులు వాడపల్లి తిరుమల శేషాచలం తెలిపారు.

కంప్యూటరీకరణపై జేసీ సమీక్ష

ఏలూరుసిటీ, ఆగస్టు 10: జిల్లాలోని సహకార సంఘ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు సహకార సంఘాల కంప్యూటరీకరణలో భాగంగా సైట్ ప్రిపరేషన్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టలేషన్ పొందుట, డీసీలో మాడ్యూల్స్ అప్‌లోడ్ చేసే విధానంపై స్థానిక గోదావరి సమావేశం మందిరంలో శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా కేంద్ర సహకార కేంద్ర బ్యాంక్ చైర్ పర్సన్ పి.ధాత్రిరెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. సహకార సంఘాలలో జరుగుతున్న కంప్యూటరీకరణలో ఎపీఏఆర్‌లో అప్‌లోడ్ చేయాల్సిన మాడ్యూల్స్ విధి విధానాలపై సహకార సంఘ కార్యదర్శులకు, బ్యాంక్ మేనేజర్లకు, సూపర్‌వైజర్లకు సహకార ఆడిటర్లకు అవగాహన కల్పించారు. జిల్లాలోని 159 సహకార సంఘాలలో త్వరితగతిన కంప్యూటరీకరణ పూర్తి చేయటానికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీసీటీ పై అవగాహన కల్పించారు. సహకార సంఘాల కంప్యూటరైజేషన్‌కు కావాల్సిన అన్ని మాడ్యూల్స్ త్వరితగతిన పూర్తి చేసి ప్రభుత్వం నిర్దేశించిన అక్టోబర్ రెండు నాటికి గో లైవ్ కావాలని జేసీ ఆదేశించారు. డీసీఓ ఆరిమిల్లి శ్రీనివాస్ తోపాటు, అధికారులు పాల్గొన్నారు.

'నా పై తప్పుడు ప్రచారం చేస్తున్నారు'

కొయ్యలగూడెం, ఆగస్టు 10: తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ తన పై కొంత మంది గిట్టని వారు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు పెడుతున్నారని అన్నారు. తనకు సంబంధంలేని గొడవల్లో తాను ఉన్నట్లుగా ప్రచారం చేస్తున్నారని వాపోయారు. వాట్సప్ గ్రూపుల్లో పెడుతూ తనను ఇబ్బందికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటువంటి వారి పై చట్టపరంగా ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. రాజకీయంగా తన ఎదుగుదల చూడలేకే ఇటువంటి ప్రచారాలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు.

రేపు న్యాయ విజ్ఞాన సదస్సు

బుట్టాయగూడెం, ఆగస్టు 10 : పులిరా ముడుగూడెంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరుగుతుందని జంగారెడ్డిగూడెం బార్ అసోషియేషన్ న్యాయ వాది యు.ఏసుబాబు తెలిపారు. సదస్సుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ హాజరవుతారని తెలిపారు. అలాగే కేఆర్ గూడెంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను, వసతిగృహాన్ని సందర్శిస్తారన్నారు. జంగారెడ్డిగూడెంకు చెందిన సాయిస్ఫూర్తి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి, మండల లీగల్ సెల్ అధారిటీ వారి ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. కొండరెడ్లు, గిరిజనులు ఉపయోగించుకోవాలని తెలిపారు.

రేపటి నుంచి యాక్షన్ ప్లాన్ శిక్షణ తరగతులు

చింతలపూడి, ఆగస్టు 10: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి 15వ తేదీ వరకు సర్పంచ్‌లకు, కార్యదర్శులకు గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం యాక్షన్ ప్లాన్ పై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీ డీవో రాటాలు తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ పొందిన కార్యకర్తలు, ఈవోపీఆర్డీ శిక్షణ ఇస్తారని, విధిగా అందరూ పాల్గొనాలని ఆయన సూచించారు.

● కుక్కునూరు : గ్రామ పంచాయతీల అభివృద్ధి పై మూడు రోజుల పాటు ప్రణాళిక శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరసింహరావు ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు, వీధిలైట్లు, తాగునీరు, అభివృద్ధి పనుల పై ఒక ప్రణాళిక రూపొందించనున్నారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

సెప్టెంబరు ఒకటి నుంచి ఏఐటీయూసీ సమ్మేళనం



పోస్టర్స్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 10 : సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకు విశాఖలో జరగ నున్న ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలను ఉద్యోగ, కార్మికులు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కార్య దర్శి ఎ.అప్పల రాజు పిలుపునిచ్చారు. కోటదిబ్బ వద్ద గల ఎఎస్ఆర్-1 వద్ద వైజాగ్‌లో జరుగుతున్న సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం పదేళ్లుగా అనుస రిస్తున్న కార్మిక, ప్రభుత్వ రంగ పరిశ్రమలకు వ్యతిరేక విధానాలపై ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొంది స్తామన్నారు. నాయకులు హెచ్.హరనాథ్‌బాబు, బి.దుర్గారావు, ఎస్ఎంవీ సుబ్బా రావు, డి.వెంకటేష్, ఎం.సయ్యద్‌బాజి, సీహెచ్.విజయ్, ఎస్.గౌరిశంకర్, కె.వెంకటే శ్వరరావు, ఎం.ఆదినారాయణ, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

నిడమర్రు ఆగస్టు 10 : వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం భువనపల్లి రైతు భరోసా కేంద్రంలో ఇటీవల కురిసిన వర్షానికి నారుమడులు దెబ్బతిన్న రైతులకు 80% సబ్సిడీపై 1153 వరివిత్తనాలు పంపిణీ చేశారు. భీమడోలు ఏడీ ఉషాకుమారి మాట్లాడుతూ 64 మంది రైతులకు 100 కింట్వార్లు విత్తనాలు సుమారు రూ.మూడు లక్షల రెండు వేల విలువైన విత్తనాలను పంపిణీ చేశామన్నారు. వైస్ ఎంపీపీ ఎస్.వీరరాఘవులు, ఏట గీతా దేవి, నాయకులు ముత్యాల స్వామి, ఎన్.దొరబాబు, ఎ.అరుణ్ పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు ప్రారంభం

చింతలపూడి, ఆగస్టు 10: చింతలపూడి-లింగపాలెం మండలాల్లోని రైతులు 2025-25 సంవత్సరానికి సంబంధించి ఈ పంట నమోదు ప్రారంభించారని, ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ ద్వారా ఈ పంట నమోదు చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి ఎండీ షాఫియా తెలిపారు. దరఖాస్తుతో పాటు పాస్‌బుక్ లేదా కౌలు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ నమోదు కోసం తీసుకురావాలన్నారు. ఈ పంట నమోదు చేయకపోతే ప్రభుత్వ పథకం వర్తించదని తెలిపారు. ఇందులో ధాన్యం అమ్మాలన్నా, సుఖీభవ పథకం, పంట నష్టం, సున్నావడ్డీ, బ్యాం కు రుణాలు, తదితరవి పొందాలంటే ఈ పంట నమోదు తప్పని సరి అన్నారు. ఆయా పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేయాలని సూచించారు.

తపాలా శాఖ కార్యాలయంలో తనిఖీలు

జంగారెడ్డిగూడెం,ఆగస్టు 10 : స్థానిక హెడ్ పోస్టాఫీసలో శనివారం ఏలూరు డివిజన్ తపాలా శాఖ పర్యవేక్షణాధికారి ఎస్.శ్రీకర్‌బాబు తనిఖీలు నిర్వహిం చారు. అనంతరం తపాలా శాఖలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలపై అవగాహన కల్పించారు. ఉద్యోగ బాధ్యతల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన సిబ్బందిని సత్కరించారు. తపాలా శాఖ ద్వారా అందించే రూ.699 తోనే రూ.10 లక్షల ప్రమాద బీమా పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తపాల శాఖ సబ్ డివిజన్ అధికారి అసిస్టెంట్ సూపరిండెంటెంట్ కె.శ్రీనివాస రావు, స్థానిక పోస్టు మాస్టర్ గంగాధర్, సబ్ డివిజన్ డివిజన్ ఇనస్పెక్టర్ దుర్గారావు, పాల్గొన్నారు.

104 మందికి వైద్య సేవలు



వ్యాధిగ్రస్తులకు సలహాలు, సూచనలు ఇస్తున్న డాక్టర్ నగేష్

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 10 : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఎం.రామారావు ప్రా రంభించిన రామకోటి ప్రాంగ ణంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో డాక్టర్ బీవీఎం నగేష్ బృందం 104 మందికి వైద్య పరీక్షలు నిర్వహిం చారు. లయన్స్ క్లబ్ నాయకులు ఎం.చలపతిరావు, కె.బాలకృష్ణ, ఎన్.నరసింహా రావు, కొత్తమాసు కృష్ణ బృందం సేవలు అందించారు.

ఆర్థోపెడిక్ వైద్య శిబిరం

ఏలూరు రూరల్, ఆగస్టు 10: స్థానిక శ్రీకృష్ణ ఆస్పత్రిలో శనివారం ఉచిత ఆర్థో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కీళ్ళు అరిగిపోవడం, ఎముకలు వం కర పోవడం, కండరాలు పట్టుకోవడం, కీళ్ళవాతం, కండరాలు, నరాల బలహీనత, తిమ్మిర్లు, కాళ్ళు మంటలకు సంబంధించి డాక్టర్ కృష్ణ పరీక్షలు నిర్వహించారు. అలాగే ఉచితంగా ఎక్స్‌రే, ఎముకల సాంద్రత, రక్త పరీక్షలు నిర్వహించారు.

నగర యాదవ సంఘం కార్యవర్గం ఏర్పాటు



నగర అధ్యక్షుడిని అభినందిస్తున్న సంఘ నాయకులు

ఏలూరు రూరల్, ఆగస్టు 10: ఏలూరు నియోజకవర్గంలోని యాదవుల సంక్షేమానికి వారి అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని నగర యాదవ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన మెరుగుమాల శ్రీనివాసరావు అన్నారు. సం ఘ భవనంలో శనివారం యాదవ సంఘ సమావేశం జరిగింది. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పి.ప్రకాష్, ఎం.శ్రీనివాస్, గౌరవ సలహాదారుగా కె.శ్రీనివాస్, పి.బాలకృష్ణ, అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాసరావు, కార్యదర్శిగా జి.సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా జగదీశ్వరరావు, డి.మల్లేశ్వరరావు, కె.నాగరాజు, ట్రెజరర్‌గా టి.శ్రీరామ్‌ప్రసాద్, జాయిం ట్ సెక్రటరీగా ఎ.దుర్గాశ్రీనివాసరావు, బి.అజయ్, ప్రసాద్, సభ్యులను ఎన్నుకున్నారు.

కోళ్లవ్యర్థాల వాహనం స్వాధీనం

పెదపాడు, ఆగస్టు 10 : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తుండగా తనిఖీలు నిర్వహించి బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకు న్నట్లుగా పెదపాడు ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. కోళ్లవ్యర్థాల రవాణాను యంత్రించేందుకు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. వాహన యజమాని, డ్రైవర్, చెరువు యజమానులపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.



చంద్రబాబు చిత్రపటానికి అర్చకుల పాలాభిషేకం

కైకలూరు, ఆగస్టు 10: చిన్న ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు ప్రతి నెలా ప్రభుత్వం రూ.10 వేలు ఇచ్చేలా జీవో విడుదల చేయడం అభినందనీయమని అర్చకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం కైకలూరు మీసాల వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద టీడీపీ నేతలు, అర్చకుల ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆర్థిక భారంతో పలు ఆలయాల నిర్వహణ కష్టతరంగా మారిన నేపథ్యంలో ఈ ఆర్థిక సాయం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు అర్చకులు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ రహీం, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు, టీడీపీ నేతలు వీరాబత్తిన సుధా, పి. రాధాకృష్ణ, లక్కింశెట్టి మోహన్, బంకపల్లి భాస్కరరావు, సయ్యద్ బాషిద్, నంగెడ్ల పవన్, ఆలయ అర్చకులు చావలి శంకరశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

చెట్లకొమ్మల తొలగింపు..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముసునూరు, ఆగస్టు 10: ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు.. శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి విద్యా శాఖాధికారులు స్పందించారు. శనివారం ఎంఈవో బి.వి.సుబ్బారావు గురుకుల బాలికల పాఠశాలలో త్రీఫేజ్ విద్యుత్ లైన్‌ను పరిశీలించారు. విద్యుత్ తీగలకు అలుముకున్న చెట్ల కొమ్మలను తొలగించాలని పాఠశాల ప్రిన్సిపాల్ కె.ప్రవీణకు సూచించారు. వెంటనే ఆమె ట్రాన్స్‌కో అధికారుల సహకారంతో కూలీలను ఏర్పాటు చేసి చెట్ల కొమ్మలు తొలగించారు.

17న ఎస్ఎంసీ ఎన్నిక

కలిదిండి, ఆగస్టు 10 : మండలంలోని పెదలంక జడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 8న కోరం లేక వాయిదా పడిన ఎస్ఎంసీ ఎన్నికను ఈ నెల 17వ తేదీన నిర్వహిస్తామని ఎంఈవో నరేష్ కుమార్ తెలిపారు. అభ్యంతరాలుంటే ఈ నెల 12న తెలియజేయాలన్నారు.



మార్చురీ బాక్సు వితరణ

కైకలూరు, ఆగస్టు 10: కైకలూరు మండలం సీతనపల్లి పంచాయతీ కార్యాలయానికి అదే గ్రామానికి చెందిన కట్టా తిమ్మరాజు అతని తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మార్చురీ బాక్స్‌ను అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి జి. శివన్నారాయణ తెలిపారు. ఈ బాక్సును పంచాయతీ కార్యాలయం నుంచి గ్రామస్థులకు ఉచితంగా అందజేస్తామన్నారు. గ్రామస్థులు చుండ్రు పాండురంగారావు, కట్టా బాలాజీ, నారగాని హరిబాబు తదితరులు ఆధ్వర్యంలో బాక్స్‌ను అందజేశారు. దాత తిమ్మరాజును గ్రామస్థులు అభినందించారు.

క్రైం సమాచారం

అమ్మ ఎప్పుడొస్తుంది..?



ధన్వి

ముదినేపల్లి, ఆగస్టు 10 : తల్లి అదృశ్యమై మూడు రోజులైంది. ఎక్కడికి వెళ్లిందో తెలియదు. తిరిగి ఇంటికి ఎప్పుడు వస్తుందో తెలియదు. ఇంట్లో అమ్మమ్మ ఏడుస్తూ కూర్చుంటోంది. ఏడేళ్ల పాపకు ఇవేవీ అర్థం కావటం లేదు. ఆప్యాయంగా చూసుకునే అమ్మ కోసం ఎదురుచూడటం తప్ప... ముదినేపల్లిలో ఈ నెల 8న కోన మహాలక్ష్మి భవాని అనే వివాహిత ఇంటి నుంచి వెళ్లిపోయి నేటికీ తిరిగి రాకపోవటంతో కుమార్తె ధన్వి (7) తల్లి కోసం ఎదురుచూస్తోంది. అమ్మ ఏది అమ్మమ్మా అంటే ఆమె కన్నీళ్లే సమాధానం. రెండో తరగతి చదువుతున్న ఆ పాప ధన్విని చూస్తుంటే జాలేస్తోంది. ఇదిలా ఉండగా, ముదినేపల్లి పోలీసులు అదృశ్యమైన లక్ష్మీభవాని ఆచూకీ కోసం బృందాలుగా ఏర్పడి విస్తృతంగా గాలిస్తున్నారు. విజయవాడలో ఉన్నట్టు సమాచారం అందటంతో పోలీసులు అక్కడ కూడా గాలిస్తున్నారు.

భార్యను హతమార్చిన భర్త అరెస్టు

కలిదిండి, ఆగస్టు 10 : సానారుద్రవరంలో భార్య అనంత లక్ష్మిని హతమార్చిన భర్త పుప్పాల నాగరాజును శనివారం అరెస్టు చేశామని కైకలూరు సీఐ కృష్ణకుమార్ తెలిపారు. ఈ నెల 8వ తేదీ రాత్రి భార్యను ఇంటి సమీపంలో ఉన్న పంచాయతీ చెరువులో ముంచి నాగరాజు హత్య చేసిన సంగతి విదితమే.

మత్తిచ్చి మేకలను ఎత్తుకుపోదామనుకున్నారు..


పట్టుకుని పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 10: మేకలకు మత్తిచ్చి ఎత్తుకుపోదామని వచ్చిన దొంగలను గ్రామ స్థులు పోలీసులకు పట్టిం చిన ఘటన తాడేపల్లిగూడెం మండలంలోని కడి యద్దలో శనివారం చోటు చేసుకుంది. కడియద్దలో మేకలు మేపే కాలనీలో ఐదుగురు వ్యక్తులు మేకలకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి మేకలను వ్యాన్‌లో తర లించేందుకు సిద్ధమయ్యారు. స్థానికులు గుర్తించి వారిని వెంబడించి పట్టుకు న్నారు. వెంటనే వారిని గ్రామ సచివాలయానికి తరలించి దేహశుద్ధి చేశారు. వారిలో ఒకరు నూజివీడుకు చెందిన వంట మాస్టారు కాగా మరో నలుగురు అదే ప్రాంతానికి చెందినవారిగా గుర్తిం చారు. ఈ ప్రాంతంలో మేకలు ఉన్న సమాచారం తెలుసుకుని చోరీకి యత్నించినట్టు గుర్తించారు. వీరిని రూరల్ పోలీసులకు అప్పగించారు. దీనిపై రూరల్ ఏఎస్సై గోపీనాథ్‌ను వివరణ కోరగా అనుమానితులను స్టేషన్‌కు తీసుకువచ్చామని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు.

చేపలు విలవిల

ఆక్సిజన్ అందక చెరువుల్లో తేలుతున్న చేపలు

పెట్టుబడులు రావంటూ ఆక్వా రైతుల ఆందోళన



కలిదిండి, ఆగస్టు 10 : వాతావరణంలో మార్పులతో చెరువుల్లో చేపలు ఆక్సిజన్ అం దక అల్లాడుతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందు తున్నారు. ఆకాశం మేఘా వృతమై చిరుజల్లులు పడుతుం డటంతో చెరువుల్లో నీరు చల్లబడి ఆక్సిజన్ కొరత కారణంగా చేపల నీటిపై తేలాడుతున్నాయి. అంతేకాక పలు చెరువుల్లో చేపలు మృత్యువాత పడు తున్నాయి. కలిదిండి మండలంలో 23 వేల ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారు. ఉదయాన్నే చెరువుల్లో చేపలు పైకి తేలటంతో రైతులు ఆక్సిజన్ కొరత నివారణకు ఖరీదైన మందులు కొనుగోలు చేసి చెరువుల్లో చలుతు న్నారు. కలిదిండి, సానారుద్రవరం, పోతుమర్రు, తాడినాడ, పెదలంక, మూ ల్లంక, కొత్తూరు గ్రామాల్లోని చెరువుల్లో చేపలు నీటిపై తేలాడుతున్నాయి. దీంతో రైతులకు కంటి మీద కునుకు ఉండటం లేదు. ఎకరం చెరువు లీజు లక్ష రూపాయలు చెల్లిస్తున్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టారు. ఈ నేపథ్యంలో చేపలు చేతికి వస్తాయో రావోనని ఆందోళన చెందుతున్నారు. కొందరు చిన్న సైజు చేపలనే పట్టుకోవటంతో కనీసం పెట్టుబడులు కూడా రావటం లేదని వాపోతున్నారు.

ఆక్సిజన్ కొరత నివారించండిలా..

చేపల చెరువుల్లో ఆక్సిజన్ కొరత నివారణకు హైడ్రోజన్ పెరాక్సైడ్ చల్లాలని మత్స్యశాఖాభివృద్ధి అధికారి రవికుమార్ తెలిపారు. ఎకరానికి కిలో చొప్పున ఈ మందు పిచికారి చేయాలన్నారు. చెరువుల్లో ఏరియేటర్లు నిరంతరాయంగా తిరుగుతూ ఉండాలన్నారు. ఉదయాన్నే చెరువుల్లో బోట్లను తిప్పుతూ ఆయిలింజన్లతో నీటిని రీసైక్లింగ్ చేయాలన్నారు. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు మేత తక్కువగా వేయాలని సూచించారు.

ఆహో..!

ఆటపాక పక్షుల కేంద్రానికి కొత్త అందాలు

రూ.20 లక్షల వ్యయంతో వసతుల ఏర్పాటు

పక్షుల కోసం 60 కృత్రిమ ఐరన్ స్టాండ్లు.. వీఐపీలకు గెస్ట్‌హౌస్



పక్షుల ఆవాసానికి కొత్తగా ఏర్పాటు చేసిన ఇనుప స్టాండ్లు

కైకలూరు, ఆగస్టు 10: సహజ సిద్ధంగా ఏర్పడిన కొల్లేరు సరస్సు విదేశీ పక్షులకు ఆలవాలం. నిత్యం పర్యాటకంతో సందడిగా ఉంటుంది. గత ప్రభుత్వం ఏవిధమైన చర్యలు తీసుకోకపోవడంతో ఉన్న వసతులు కూడా తుప్పుపట్టి పోయాయి. ఏలూరు జిల్లాలో 77,136 ఎకరాల్లో విస్తరించి ఉన్న కొల్లేరు సరస్సులో ఆటపాక పక్షుల కేంద్రం పర్యాటకంగా పేరొందింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పక్షుల కేంద్రానికి రూ.20 లక్షల వ్యయంతో అభివృద్ధి పనుల చేపట్టారు. పక్షుల ఆవాస కేంద్రాలను ఏర్పాటు, పర్యాటకులు సేద తీరేందుకు సిమెంటు బల్లలు, బోట్లు మరమ్మతులు వంటివి చేపట్టారు. వీఐపీలు వచ్చిన సమయంలో విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాట్లను నిర్వహించారు. విదేశీ పక్షులు ఆవాస కేంద్రాలను ఏర్పాటు చేసుకునేందుకు 60 కృత్రిమ ఐరన్ స్టాండ్లు, 30 సిమెంటు బల్లలను ఏర్పాటు చేశారు. లైఫ్ జాకెట్‌లను కొనుగోలు చేశారు. పర్యాటకులకు ప్రైవేటు గెస్ట్‌హౌస్ ఏర్పాటు చేశారు. గతంలో కృత్రిమ ఐరన్ స్టాండ్లు లేకపోవడంతో పక్షుల ఆవాస కేంద్రాలకు చోటు లేకపోవడంతో వేరే ప్రాంతా లకు వెళ్లిపోయేవి. కొత్తగా స్టాండ్లు ఏర్పాటు చేయడంతో మరిన్ని పక్షులు కొల్లేరు సరస్సుకు వస్తాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఈడీసీ కేంద్రం వద్ద ప్రహారీగోడలపై పక్షుల చిత్రపటాలు పిల్లలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. బోటు షికారుతో పాటు పక్షుల నమూనాలను తెలిపే విధంగా పెయింటింగులు ఏర్పాటు చేశారు.



పక్షుల కేంద్రంలో గోడలపై ఆకట్టుకుంటున్న పెయింటింగ్‌లు





చిల్డ్రన్స్ పార్క్‌లో కొలువుదీరిన ఆట పరికరాలు



పక్షుల కేంద్రంలో కనువిందు చేస్తున్న విదేశీ పక్షులు

బ్రిడ్జి నిర్మాణం వేగవంతం చేయండి

అధికారులను ఆదేశించిన మంత్రి సారథి



తమ్మిలేరు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సారథి

ముసునూరు, ఆగస్టు 10: బలివే బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. మండలంలోని బలివే తమ్మిలేరుపై రూ. 16 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను, బ్రిడ్జి మ్యాప్‌ను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ్మిలేరు వరద సమయంలో విజయరాయి వైపు విద్యార్థులు, ప్రజల రాకపోకలు స్తంభిస్తున్నాయన్నారు. బ్రిడ్జి నిర్మాణంలో ఇంకా రెండు స్లాబ్‌లు నిర్మించాల్సి ఉందని, వర్షాలు తగ్గి, వాతావరణం అనుకూలించిన తరువాత స్లాబ్‌ల నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని ఇరిగేషన్ ఏఈఈ దేవప్రకాష్‌కు మంత్రి సూచించారు. నిర్మాణం పూర్తి అయ్యేవరకు విద్యార్థులు, ప్రజలు తమ్మిలేరుకు అటువైపు వెళ్ళేందుకు స్లాబ్‌ల స్థానంలో ప్రమాదం లేకుండా ఇనుప షీట్లు ఏర్పాటు చేయాలన్నారు. తమ్మిలేరుకు విజయరాయి వైపు ర్యాంపు, మెట్లు తదితర నిర్మాణాల నిమిత్తం స్థలం సేకరించవలసి ఉండగా యజమానులతో తాను స్వయంగా ఫోన్‌లో మాట్లాడి ఒప్పించానన్నారు. సదరు భూ సేకరణకు సంబంధించి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ ప్రక్రియ పూర్తి కాగానే విజయరాయి వైపు కూడా ర్యాంపు, మెట్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బలివే శ్రీరామలింగేశ్వర స్వామిని మంత్రి దర్శించుకుని పూజలు చేయగా ఆలయ అధికారులు మంత్రిని సత్కరించి, స్వామివారి ప్రసాదం అందజేశారు. నూజివీడు ఆర్డీవో భవానీ శంకరి, డీఈ వై.అర్జునరావు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

పెద్దపాలేరులా పాటుపడతా..

నూజివీడు నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపాలేరునవుతానని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ముసునూరు మండలం గోపవరం జడ్పీ పాఠశాలలో ఎన్ఆర్ఐ శివ రూ. 60 వేలతో పునఃనిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించి మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని రహదారులను ఉపాధి, వనసంరక్షణ నిధులతో త్వరలోనే అభివృద్ధి చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఖజానా మొత్తం ఖాళీచేసి ఇచ్చిందన్నారు. రాష్ట్రంలో ఇల్లులేని పేదవాడు ఉండకూడదనేది ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. వచ్చే ఏడాది మార్చి నుంచి ఇల్లు కట్టుకునే ప్రతి ఒక్కరికి రూ 4.30 లక్షలు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సారథి కోరారు.



రహదారి నిర్మించకుంటే ధర్నా చేస్తాం

మండవల్లి ఆగస్టు 10 : మండవల్లి పీహెచ్‌సీకి వెళ్లే రహదారిని డ్రైనేజీ నిర్మాణం నిమిత్తం 20 నెలల క్రితం తవ్వేసి డ్రైనేజీ నిర్మాణం జరిగినప్పటికీ రోడ్డును పునరుద్ధరించడంలో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, టి. అప్పారావు, శనివారం నిరసన తెలిపారు. శనివారం జాతీయ రహదారిని పరిశీలించి కృష్ణారావు, చిట్టిబాబులు మాట్లాడుతూ పీహెచ్‌సీ రోడ్డు మార్గం సరిగా లేక బాలింతలు, గర్భిణులు, వృద్ధులు, విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మార్గం లేక అంబులెన్సు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని అధికారులు వెంటనే స్పందించి పీహెచ్‌సీ రోడ్డును బాగు చేయాలని లేకుంటే ధర్నాకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు ఏసుబాబు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ గ్రామ సభలు



నూజివీడు టౌన్, ఆగస్టు 10: నూజివీడు మండ లం లోని ఏడు గ్రామాల్లో శని వారం సామాజిక తనిఖీ గ్రామ సభలను నిర్వహించారు. పోతి రెడ్డిపల్లి, తూర్పు దిగవల్లి, పొల సానపల్లి గ్రామాల్లో ఎంఈ వో సేవ్యా నాయక్ ఆధ్వర్యం లో, అన్నవరం, రామన్న గూడెం, మిట్టగూడెం, మిర్జాపురం గ్రామాల్లో ఏవో చాముండేశ్వరి ఆధ్వర్యంలో గ్రామ సభలను నిర్వహించారు. అన్ని గ్రామాల్లోను సామాజిక తనిఖీ ప్రశాంతంగా ముగిసింది.



సంపద కేంద్రాల సందర్శన

ముదినేపల్లి, ఆగస్టు 10 : మండలంలోని కోడూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీల కార్యదర్శులు సందర్శించారు. పంచాయతీలకు సంబంధించి వివిధ అంశాలపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా కోడూరు సంపద కేంద్రాన్ని సందర్శించారు. ఆ గ్రామ సర్పంచ్ కృష్ణ కుమార్ సంపద కేంద్రం నిర్వహణను వివరించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ నిర్మించిన ఈ కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తామని పలువురు సర్పంచ్‌లు తెలిపారు. కొర్రగుంటపాలెం సర్పంచ్ పేరే రామకృష్ణ, పంచాయతీల కార్యదర్శులు వీడీ శ్రీనివాస్, గిరిజ, సంగమయ్య, హారిక తదితరులు మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ఎంవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలని ఎంపీడీవో దినతేజ్ అన్నారు. శనివారం పడమటి పాలెంలో సంపద కేంద్రాన్ని పరిశీలించారు. సర్పంచ్ సానా మీనా సరస్వతీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సమర్థ పాలనతోనే పంచాయతీల అభివృద్ధి

ముసునూరు: సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో సమర్థ వంతమైన పాలన సాగించినప్పుడే పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని సూపరింటెండెంట్ కె.సాయిరాము అన్నారు. పంచాయతీల పాలనా విధానంపై మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సాయిరాము మాట్లాడుతూ సర్పంచ్‌లు గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చి పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలన్నారు.





చాట్రాయి, ఆగిరిపల్లిలో యూటీఎఫ్ పతాకావిష్కరణలు



ముదినేపల్లిలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు

చాట్రాయి, ఆగస్టు 10: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా రాష్ట్రవాప్త పిలుపు మేరకు, స్థానిక మండల రిసోర్స్ సెంటర్‌లో శనివారం యూటీఎఫ్ పతాకాన్ని జిల్లా కార్యదర్శి వీరకోటి ఆవిష్కరించారు. వక్తలు మాట్లాడుతూ యూటీఎఫ్ 1974 ఆగస్టు 10న ఆవిర్భవించి ఉపాధ్యాయుల సమస్యలపై రాజీ లేని పోరాటాలు చేస్తూ అనేక సమస్యలు పరిష్కరించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు చీదిరాల రఘు, జిఎస్ఎన్ రెడ్డి, రత్తయ్య, సీఐటీయూ నాయకులు కొమ్ము ఆనందం, హోలీమేరీ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఆగిరిపల్లి యూటీఎఫ్ కార్యాలయంలో గౌరవ మాజీ అధ్యక్షుడు బి.జీవరత్నం దంపతులు పతాకావిష్కరణ గావించారు. ప్రధాన కార్యదర్శి కె.అజరయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు జ్ఞానసుందరం, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముసునూరు: ముసునూరులో యూటీఎఫ్ సీనియర్ నాయకుడు, జిల్లా కౌన్సిలర్ కె.బెనర్జీ యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. యూటీఎఫ్ 50 ఏళ్ళుగా ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తూ, విజయాలను సాధిస్తోందని మండల అధ్యక్షులు జి.పద్మకిషోర్ అన్నారు. జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు కాసాని గాంగేయుడు, మండల ప్రధాన కార్యదర్శి పుల్లయ్య సహాధ్యక్షులు జి.రాంబాబు, గౌరవ అధ్యక్షుడు సీహెచ్.జాకబ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలో సమాఖ్య మండల అధ్యక్షురాలు



ముసునూరులో..

ఎం. సాయిలక్ష్మి యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించి ఫెడరేషన్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ఉద్యమాలు, సాధించిన విజయాలను వివరించారు. సమాఖ్య రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు గొట్టిపాటి రమేష్, జిల్లా కార్యదర్శి బేతాళరావు, మండల ప్రధాన కార్యదర్శి ఐ.దుర్గా ప్రసాద్, నాయకులు యశోద కృష్ణ, వల్లూరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీల్లో 309 సీట్లు ఖాళీ

త్వరలో మూడో విడత కౌన్సెలింగ్

నూజివీడు టౌన్, ఆగస్టు 10: ఆర్జీయుకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో మొదటి, రెండు విడతల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తికాగా 309 సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోయాయి. మొత్తం నాలుగు క్యాంపస్‌లకు గాను 4 వేల ట్రిపుల్ ఐటీ సీట్లకు మరో 400లు సూపర్ న్యూమరీ సీట్లు కలిపి 4,400 సీట్లకు ఆర్జీయూకేటీ అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించింది. నాలుగు క్యాంపస్‌ల మీద 753 సీట్లు మిగలగా రెండో విడత కౌన్సెలింగ్‌లో 444 సీట్లు భర్తీ అయ్యి 309 సీట్లు మిగిలాయి. వీటికి త్వరలో మూడో విడత కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించనున్నట్టు ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు.



గ్రోవెల్ కంపెనీ ప్రతినిధులతో చర్చిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

చేపల మేత కంపెనీని సందర్శించిన కేంద్ర బృందం

ముదినేపల్లి, ఆగస్టు 10 : సింగరాయపాలెంలోని గ్రోవెల్ ఫిష్ ఫీడ్ తయారీ కంపెనీని శనివారం అంతర్జాతీయ ఆహార, వ్యవసాయ సంస్థకు చెందిన ప్రతినిధుల బృందం సందర్శించి మేత తయారీని పరిశీలించింది. ఆక్వా రైతులకు నాణ్యమైన చేపలు, రొయ్యల మేతను అందించటమే కంపెనీ లక్ష్యంగా ఉండాలని కంపెనీ ప్రతినిధులకు తెలిపారు. మేత తయారు చేస్తున్న విధానంపై ప్రతినిధుల బృందం అధ్యయనం చేసింది. ఆహార, వ్యవసాయ సంస్థ ప్రతినిధులు కొండా చవ్వా, సీమా భట్, విష్ణు భట్, నీలకంఠ విశ్ర, మత్స్యశాఖ రాష్ట్ర అదనపు డైరెక్టర్ డాక్టర్ అంజలి, జాయింట్ డైరెక్టర్ నాగలింగాచార్యులు, ముదినేపల్లి తహసీల్దార్ సుబానీ, గ్రోవెల్ కంపెనీ ఎండీ ఏ.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలిదిండిలో ఆక్వా హబ్ పరిశీలన..

కలిదిండి: కలిదిండిలో శనివారం ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ టీం ఆక్వా హబ్‌ను సందర్శించింది. రైతుల నుంచి చేపలు కొనుగోలు చేసి వాటిని ఏ విధంగా ప్రాసెసింగ్ చేసి ఇతర రాష్ట్రాలకు విక్రయించే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోగేశ్వరం లంకలో 5 ఎకరాల రొయ్యల చెరువును పరిశీలించారు. రొయ్యల సాగు విధానాన్ని ఆక్వా రైతును అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఆర్డీవో ఖాజావలీ, తహసీల్దార్ రామకృష్ణ, జిల్లా మత్స్యశాఖాధికారి నాగలింగాచార్యులు, అదనపు డైరెక్టర్ అంజలి, మత్స్యశాఖాభివృద్ధి అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

నూజివీడు టౌన్, ఆగస్టు 10: నూజివీడు ఎంఎన్‌కే రహదారిపై రూరల్ సీఐ రామకృష్ణ వాహన తనిఖీలను నిర్వహించారు. విజువల్ పోలీసింగ్‌లో భాగంగా నిర్వహించిన ఈ వాహన తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు అపరాధ రుసుం విధించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలుంటాయని హెచ్చరించారు.





ఆలయం, విగ్రహాల ప్రతిష్ఠ

వైభవంగా రామాలయ ప్రతిష్ఠ.. మంత్రి పూజలు

ఆగిరిపల్లి, ఆగస్టు 10: ఆగిరిపల్లి మండలం గోపాలపురంలో రామాలయ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. భక్తుల జయజయ ధ్వానాల మధ్య సీతారామ, లక్ష్మణ, హనుమంతుని విగ్రహాల ప్రతిష్ఠ, శిఖర, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. మంత్రి పార్థసారథి స్వామివారికి పూజలు చేయగా అర్చకులు ఆయనను సత్కరించారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో మంత్రి పాల్గొన్నారు.

రజకులకు చెరువు కేటాయించాలి

ముదినేపల్లి, ఆగస్టు 10 : ముదినేపల్లి పంచాయతీ ఏరియాలో తమ వృత్తి నిర్వహణకు ప్రత్యేకంగా చెరువును కేటాయించాలని స్థానిక రజక సంఘ నాయకులు కోరారు. శనివారం సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, కార్యదర్శి శ్రీనివాస్‌ను సంఘ అధ్యక్షుడు యలకుర్తి నాగరాజు, ఉపాధ్యక్షుడు మీసాల సత్యనారాయణ, నాయకులు కలసి సంఘ రిజిస్టర్డ్ కాపీని అందజేశారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ



చాట్రాయి, ఆగస్టు 10: కృష్ణా మిల్క్ యూనియన్ పరిధిలో పోలవరం పాల సహకార సంఘం సభ్యులైన రైతులకు 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి విడత బోనస్‌గా రూ. 1.28 లక్షలు శనివారం సంఘ అధ్యక్షుడు చెలికాని శ్రీరామ్ పంపిణీ చేశారు. అలాగే కోటపాడు సంఘంలో పాడి రైతులకు అధ్యక్షుడు శ్రీనివాసరావు రూ. 3.66 లక్షలు, కమ్మటూరు సంఘంలో రూ 2.99 లక్షలు అధ్యక్షుడు పొన్నగంటి శ్రీనివాసరావు పంపిణీ చేశారు. మండలంలోని పాడి రైతులకు మొత్తం రూ. 41 లక్షలు బోనస్ పంపిణీ చేస్తున్నట్లు తిరువూరు పాలశీతల కేంద్రం మేనేజర్ సాంబశివమూర్తి చెప్పారు.